PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 211 | విజయవాడ, శనివారం 4 మార్చి 2023 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Saturday 4 March 2023 | Rs



ఉక్కు పరిరక్షణ నేతలపై నిర్బంధం

- 32 మంది అరెస్టు
- కేంద్ర మంత్రి గడ్కరీ పర్యటన నేపథ్యంలో ప్రభుత్వ దుశ్చర్య



14 నుంచి అసెంబ్లీ సమావేశాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 14 నుంచి ప్రారంభం కానున్నాయి. ఆ రోజు ఉదయం 10 గంటలకు గవర్నరు ఎస్ అబ్దుల్ నజీర్ ఉభయ సభలనుద్దేశించి ప్రసంగించనున్నారు. అదేరోజు అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టనున్న బిల్లుల ఆమోదం కోసం కేబినెట్ సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేసింది.

మీ వ్యాపారాలకు పూచి నాది

• సుస్థిర ప్రగతిలో దేశంలోనే అగ్రగామిగా ఎపి • గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్-2023లో సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

'మీ వ్యాపారాలకు, పెట్టుబడులకు నాదీ హామీ. పరిశ్రమ మీది. ప్రోత్సాహం మాది. దేశంలోనే సుస్థిర ప్రగతిని సాధించే అగ్రగామి రాష్ట్రంగా ఎపిని తీసుకెళ్లడమే నా లక్ష్యం' అంటూ దేశ, విదేశ పారిశ్రామికవేత్తలకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి భరోసా ఇచ్చారు. విశాఖలోని ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్స్‌లో రెండు రోజులపాటు జరగనున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్-2023ను శుక్రవారం ఆయన ఘనంగా ప్రారంభించారు. సమ్మిట్ ప్రధాన వేదికపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీ, అదానీ పోర్ట్స్ సిఇఒ కరన్ అదానీ, జిఎంఆర్ అధినేత గ్రంధి మల్లికార్జునరావు, జిందాల్, అదిత్యా బిర్లా గ్రూప్, అరబిందో గ్రూప్, డైకిన్, ఎన్‌టిపిసి, ఐఒసిఎల్ కంపెనీల ప్రతినిధులు ఆశీనులయ్యారు. దేశ, విదేశీ ప్రతినిధులు హాజరయ్యారు. వారినుద్దేశించి ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఈ సమ్మిట్‌లో రూ.13 లక్షల కోట్లు పెట్టుబడులు, 340 ఎంఒయుల ప్రతిపాదనలతో పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 20 రంగాల్లో ఆరు లక్షల ఉద్యోగావకాశాలు రానున్నాయని పేర్కొన్నారు. ఈ నెల 28 నుంచి 30 వరకూ జరగనున్న జి-20 దేశాల వర్కింగ్ కమిటీ సమావేశాలకూ విశాఖే ఆతిథ్యం ఇస్తోందన్నారు. ఖనిజ సంపద, సహజ వనరులు పుష్కలంగా ఉన్న ఆంధ్రప్రదేశ్ ఇప్పటికే ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ప్రథమ స్థానంలో ఉందని తెలిపారు. ఈ సమ్మిట్లతో వ్యాపార వాతావరణం విస్తరించనుందన్నారు. వ్యాపార రంగంలో స్నేహపూర్వక వాతావరణం, బలమైన మౌలిక వసతుల కల్పన, ఆరోగ్యకరమైన పోటీ, నూతన ఆవిష్కరణలతో రాష్ట్రం స్థిరమైన, దీర్ఘకాలిక అభివృద్ధి సాధించేందుకు పారిశ్రామికవేత్తల భాగస్వామ్యం కోరుతున్నామని పేర్కొన్నారు. విశాఖపట్నం బలమైన ఆర్థిక కేంద్రంగా విరాజిల్లడానికి ఇక్కడ నెలకొల్పబడిన ప్రభుత్వ, ప్రయివేట్ రంగ యూనిట్లు, పోర్టు ఆధారిత మౌలిక సదుపాయాలు, మెడ్‌టెక్ జోన్, టూరిస్టు హాట్‌స్పాట్‌లు కారణమన్నారు. విశాఖను ఎగ్జిక్యూటివ్ కేపిటల్‌గా తమ ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించిందని గుర్తు చేశారు. కొద్దిరోజుల్లో తాను విశాఖకు వచ్చి పాలన చేపడతానని మరోసారి ప్రకటించారు.



- ఎపిలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించడమంటే ఒక బహుమతిగా ఎవరైనా భావిస్తారు.
  - ముఖేష్ అంబానీ, రిలయన్స్ అధినేత
- పెట్టుబడులకు భవిష్యత్తు గమ్యస్థానంగా ఎపి నిలదొక్కుకుంటోంది
  -గ్రంధి మల్లికార్జునరావు, జిఎంఆర్ గ్రూప్ అధినేత
- ఎపితో కలిసి పనిచేయడం గొప్ప అనుభవంగా భావిస్తున్నాం
  -నవీన్ జిందాల్, జిందాల్ స్టీల్ అండ్ పవర్ లిమిటెడ్ అధినేత

ఎపి అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉంది : కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

ఎపి అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర రోడ్లు, రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. తొలిరోజు సమ్మిట్‌లో పాల్గొన్న ఆయన ఆరు లైన్ల వైజాగ్ పోర్టు హైవేను రూ.6300 కోట్లతో నిర్మించేందుకు ఆమోదం తెలిపినట్లు వేదికపై ప్రకటించారు. సిఎం వైఎస్ జగన్ ఆరు లేన్ల వైజాగ్ పోర్టు హైవే డిమాండ్‌ను చాలా కాలంగా తన ముందు ఉంచారన్నారు. ఈ రహదారి 55 కిలోమీటర్ల వరకూ ఉంటుందని తెలిపారు. రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ మౌలిక వసతులకు పెద్దపీట వేస్తున్నామన్నారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ ఉత్పత్తులు, ఉద్యాన రంగాలతోపాటు ఆధునిక రంగాల్లో రాష్ట్రంలో పుష్కలంగా అవకాశాలున్నాయని తెలిపారు. రవాణా రంగంలో అనుకూల పరిస్థితులు ఉన్నాయని, మెట్రోపొలిటన్ సిటీలకు ఏ మాత్రమూ తీసిపోని విధంగా విశాఖకు ఇప్పటికే అన్ని హంగులూ ఉన్నాయని పేర్కొన్నారు.

ఊహలకందని లెక్కలు

గ్లోబల్ ఇన్వెస్టర్ల సమ్మిట్-2023 ద్వారా రూ.2 లక్షల కోట్లు పెట్టుబడులు సమీకరిస్తున్నట్లు నెల రోజుల నుంచీ వివిధ సందర్భాల్లో ప్రభుత్వ పెద్దలు గుడివాడ అమర్‌నాథ్, వైవి.సుబ్బారెడ్డి చెబుతూ వచ్చినా సమ్మిట్ రోజు శుక్రవారం సిఎం వైఎస్ జగన్ రూ.13 లక్షల కోట్లు ఎంఒయులు అని ప్రకటించగానే సభికులంతా ఒక్కసారిగా ఆశ్చర్యానికి గరయ్యారు. వెంటనే తేరుకుని చప్పట్లు కొట్టారు. ఊహలకందని లెక్కలు ఎలా వచ్చాయి? ఎక్కడ తయారయ్యాయి? అంటూ సభికుల్లో చర్చ జరిగింది.

ముఖేష్ అంబానీ, జగన్ మధ్య ఎడతెరిపిలేని చర్చలు

సమ్మిట్ వేదిక వైఎస్ జగన్, రిలయెన్స్ అధినేత ముఖేష్ అంబానీ మధ్య సభా వేదికపైనే 'వన్ టు వన్' మీటింగులా ఇద్దరూ ఎడతెరిపి లేకుండా చర్చించుకోవడం కనిపించింది. సభలో సుమారు 20 మంది జాతీయ, అంతర్జాతీయ పారిశ్రామిక ప్రతినిధులు ఓ వైపు ప్రసంగాలు చేస్తుండగానే వీరిద్దరి మధ్య వ్యక్తిగతంగా కొనసాగింది. దీంతో అందరి దృష్టి వీరిపై నిలిచింది.

కిట్ల కోసం సభా ప్రాంగణంలో గలాటా, స్టాల్ ధ్వంసం

మధ్యాహ్నం రెండు గంటల సమయంలో నిర్వాహకులు అందజేసిన కిట్ల కోసం సభా ప్రాంగణంలో గలాటా చోటుచేసుకుంది. ప్రతినిధులకు విధిగా అందజేయాల్సిన కిట్లు సకాలంలో వారికి అందలేదు. కిట్ల పంపిణీ వద్దకు కొంతమంది ప్రతినిధులు వచ్చి తమకు అందలేదని వాదనకు దిగారు. నిర్వాహకుల నుంచి సరైన సమాధానం రాకపోవడంతో స్టాల్‌ను ధ్వంసం చేశారు.



అదానీతో ఒప్పందాలు రద్దు

సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్

- గంగవరం పోర్టు ప్రభుత్వ స్వాధీనం చేసుకోవాలి
- 'దేశానికి మోదాని ముప్పు' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అంతర్జాతీయ ఆర్థిక నేరగాడైన అదానీతో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న అన్ని రకాల ఒప్పందాలను రద్దు చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మోడీ, అదానీ అక్రమాలపై సిపిఎం రాష్ట్ర కమిటీ ప్రచురించిన 'దేశానికి మోదాని ముప్పు' పుస్తకాన్ని పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, సిహెచ్.బాబూరావు, రమాదేవితో కలిసి ఆయన శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ అదానీ వంటి వ్యక్తుల చేతుల్లో పోర్టులు ఉండటం దేశానికి ప్రమాదకరమని వ్యాఖ్యానించారు. గంగవరం పోర్టుతో పాటు, వివిధ ఒప్పందాల సాకుతో ఆయనకు అప్పగించిన భూములను రాష్ట్ర ప్రభుత్వం తక్షణం స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. దేశ సంపదను అదానీ లూటీ చేశారని, అక్రమార్జనతో ప్రపంచంలోనే రెండో అతిపెద్ద సంపన్నుడిగా ఎదిగాడని తెలిపారు. అమెరికాకు చెందిన హిండెన్ బర్గ్ సంస్థ ఇచ్చిన నివేదికతో ఒక్కసారిగా 26వ స్థానానికి దిగజారారని అన్నారు. అదానీ అక్రమాలకు కేంద్రంలో మోడీతోపాటు రాష్ట్రంలో జగన్ కూడా సహకరించారన్నారు. కృష్ణపట్నం పోర్టు, గంగవరం పోర్టు,సోలార్ ప్రాజెక్టులు, విమానాశ్రయాలు రాష్ట్రంలో అదానీకి అప్పగించారని, చివరికి ఇప్పుడు బస్టాండులపై కూడా కన్నేశారని అన్నారు. వీటన్నింటికి మించి పంప్డ్ స్టోరేజి ప్రాజెక్టుల పేరుతో కడప, అన్నమయ్య, అల్లూరి సీతారామరాజు జిల్లాలో మిగతా 5లో

14 నుండి ప్రచార కార్యక్రమం

అదానీ అక్రమాలను వివరిస్తూ ఈ నెల 14వ తేదీ నుండి 22 వరకూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు శ్రీనివాసరావు తెలిపారు. మోదానీ పుస్తకాన్న విస్తృతంగా ప్రచారంలో పెడతామని చెప్పారు. ప్రతి జిల్లాలోనూ రౌండ్‌టేబుళ్లు, సదస్సులు, సెమినార్‌లు నిర్వహించి మోడీ, అదాని (మోదాని) మధ్య ఉన్న సంబంధాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్తామన్నారు. 'మోదాని కార్పొరేట్ కంపెనీగా మారిపోయింది. దీనిపై ప్రజలు తిరుగుబాటు చేయాలి. మోదాని దోపిడికి జగన్ కూడా సహకరిస్తున్నారు. దీనికి ఆయన వివరణ ఇవ్వాలి.' అని అన్నారు

బిజెపి ఎమ్మెల్యే ఇంట్లో నోట్ల కట్టలు

లంచం తీసుకుంటూ పట్టుబడ్డ పుత్రరత్నం



బెంగళూరు : బిజెపి ఎమ్మెల్యే ఇంట్లో నోట్ల కట్టలు పట్టుబడటం సంచలనం కలిగించింది. టెండరు ఇప్పిస్తానంటూ రూ.40 లక్షలు లంచం తీసుకుంటూ కెఎస్‌డిఎల్ కార్యాలయంలో కర్ణాటక బిజెపి ఎమ్మెల్యే కుమారుడు లోకా యుక్త అవినీతి నిరోధక విభాగానికి పట్టుబడ్డాడు. బిజెపి ఎమ్మెల్యే మాదల్ విరూపాక్షప్ప ప్రముఖ బ్రాండ్ మైసూర్ శాండిల్ సోప్‌లను తయారు చేసే కర్ణాటక సోప్స్ అండ్ డిటర్జెంట్స్ లిమిటెడ్ (కెఎస్‌డిఎల్)కి ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. సబ్బులు, ఇతర డిటర్జెంట్లు తయారీకి అవసరమైన ముడిసరుకు కోసం కాంట్రాక్ట్ ఇచ్చేందుకు విరూపాక్షప్ప కుమారుడు ప్రశాంత్ మాదల్ 40 శాతం కమిషన్‌ను డిమాండ్ చేయగా, కాంట్రాక్టర్ 30 శాతానికి ఒప్పందం కుదుర్చుకుని లోకాయుక్తకు సమాచారమిచ్చాడు. దీంతో, గురువారం సాయంత్రం ప్రశాంత్ పట్టుబడినట్లు కర్ణాటక లోకాయుక్త బిఎస్ పాటిల్ తెలిపారు. ఎమ్మెల్యే నివాసంలో జరిపిన సోదాల్లో రూ.6.10 కోట్లు, అతని కార్యాలయంలో రూ.2.2 కోట్లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ప్రశాంత్‌ను 14రోజుల జ్యుడీషియల్ కస్టడీకి బెంగళూరులోని లోకాయుక్త కోర్టు పంపించింది. ప్రశాంత్ బెంగళూరు నీటి సరఫరా, మురుగు నీటి బోర్డు (బిడబ్ల్యుఎస్ఎస్‌బి)లో చీఫ్ అకౌంటెంట్‌గా పనిచేస్తున్నారు. అవినీతి వెలుగు చూడటంతో కెఎస్‌డిఎల్ ఛైర్మన్ పదవికి విరూపాక్షప్ప రాజీనామా చేశారు. ఇప్పటికే 40 శాతం కమిషన్ల అంటూ కర్ణాటక సిఎం బొమ్మై సహా పలువురు బిజెపి నేతలు పీకల్లోతు అవినీతిలో కూరుకుపోయిన నేపథ్యంలో విరూపాక్షప్ప రాజీనామా చేయాల్సి వచ్చింది.

త్రిపురలో బిజెపి దాడులు

ప్రతిపక్ష కార్యకర్తల ఇళ్లు దహనం



బిజెపి గూండాల దాడుల్లో దగ్ధమౌతున్న సిపిఎం కార్యకర్తల నివాసాలు

అగర్తలా : త్రిపుర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెల్లడైన మరు క్షణం నుంచే బిజెపి గూండాలు ఇష్టానుసారంగా చెలరేగిపోయారు. సిపిఎం, ఇతర ప్రతిపక్ష పార్టీల కార్యకర్తల ఇళ్లపైన, పార్టీ కార్యాలయాలపైన హింసాత్మక దాడులకు దిగారు. ఈ దాడుల్లో సబ్ డివిజనల్ పోలీసు అధికారితో సహా 25మంది గాయపడ్డారు. అగర్తలాలోని బదర్‌ఘాట్ ఏరియాలో సిపిఎం కార్యకర్త ఇంటిపై బిజెపి ముష్కరులు దాడి చేశారు. అప్పటికే ఆ కార్యకర్త తన కుటుంబ సభ్యులను తీసుకుని వెళ్లిపోయాడు. దీంతో ఆయన ఇంటిని కాషాయ మూకలు తగులబెట్టాయి. ఇటువంటి దాడులే మోహన్‌పూర్, సూర్యమణి నగర్, రామ్‌నగర్, బెలోనియా, సోనామురా తదితర ప్రాంతాల్లో చోటుచేసుకున్నాయి. తిప్రా మోతా కార్యకర్తల ఇళ్లపైనా దాడులకు దిగారు. దీంతో కొన్ని చోట్ల ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. తెలియామురా, కృష్ణపూర్ నియోజకవర్గాల్లో తిప్రా మోతా పార్టీ మద్దతుదారుల ఇళ్లపై దాడులు జరిగాయి. ఈ దాడిలో తెలియమురా సబ్ డివిజనల్ పోలీసు అధికారి ప్రసూన్ కాంతి తలకు తీవ్ర గాయమైంది. ఆగ్రహించిన తిప్రా మద్దతుదారులు బిజెపి మండల కార్యాలయంపై దాడి చేశారు. పోలీసులు వారిని అడ్డుకోవడానికి ప్రయత్నించగా, పోలీసులపై కూడా వారు దాడి చేశారు. ఇలాగే దక్షిణ త్రిపురలోని శాంతిబజార్, సెపాయిజలా జిల్లాలోని బిషల్‌ఘర్‌ల్లో కూడా హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయి. ఎస్‌డిఎం కార్యాలయాలను, కొన్ని వాహనాలను కూడా ధ్వంసం చేశారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి దాడి చేసినవారిని వదిలేసి బాధితులపైనే లాఠీచార్జికి దిగారు.

దొంగే దొంగ అన్న చందంగా బిజెపి కార్యకర్తలపై ప్రతిపక్షాలే దాడులకు దిగుతున్నాయని పాలక పార్టీ ఎదురు దాడి చేసింది.

గురువారం ఓట్ల లెక్కింపు జరుగుతుండగానే, బిషాల్‌ఘర్ సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ కార్యాలయం ఎదురుగా ఉన్న ఇంటిపై కొందరు దుండగులు బాంబులు విసిరారు. ఇక్కడ గెలుపొందిన బిజెపి అభ్యర్థి సుశాంత దేవ్ మాట్లాడుతూ, మోతా కార్యకర్తలు అకస్మాత్తుగా తమ పార్టీ కార్యాలయంపై దాడి చేసి విధ్వంసానికి దిగారని, పదిమంది పార్టీ కార్యకర్తలు గాయపడ్డారని తెలిపారు.

భారత్-బంగ్లాదేశ్ సరిహద్దులోని రవిదాస్‌పరా ప్రాంత ప్రజలు సిపిఎంకి ఓటు వేశారని ఆరోపిస్తూ బిజెపి మద్దతుదారులు దాడికి దిగారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసినప్పటికీ, ఫిబ్రవరి 16న పోలింగ్ తర్వాత కూడా దాడులు కొనసాగుతూనే వున్నాయి. ఇప్పటివరకు ఈ దాడుల్లో 52మందికి పైగా గాయపడ్డారు.

ఆరుద్ర రామలక్ష్మి కన్నుమూత

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

ప్రముఖ రచయిత్రి కె.రామలక్ష్మి (92) కన్నుమూశారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె శుక్రవారం మధ్యాహ్నం హైదరాబాద్ మలక్‌పేటలోని తన నివాసంలో తుది శ్వాస విడిచారు. 1930 డిసెంబర్ 31న తూర్పుగోదావరి జిల్లా కోటనందూరులో



జన్మించిన ఆమె మద్రాసు విశ్వవిద్యాలయం నుంచి బిఎ పట్టా పొందారు. ఆంగ్ల, ఆంధ్ర సాహిత్యం, ప్రాచీనాంధ్ర సాహిత్యం చదివారు. 1951 నుంచి రచనలు ప్రారంభించారు. చాల కథలు, నవలలు రాశారు. విడదీసే రైలు బళ్లు, మెరుపు తీగె, అవతలి గట్టు, తొణికిన స్వర్గం, పెళ్లి, ప్రేమించు, ఆంధ్ర నాయకుడు వంటి ఎన్నో రచనలు చేశారు. తెలుగు స్వతంత్ర్యలో ఇంగ్లీషు విభాగానికి ఉపసంపాదకులుగా పనిచేశారు. 1954లో ఆమెకు, ప్రముఖ కవి, సాహిత్య విమర్శకులు ఆరుద్రకు వివాహమైంది. వీరికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. రామలక్ష్మి భర్త ఆరుద్ర గతంలోనే మృతి చెందారు. రామలక్ష్మి మృతికి సాహితీ ప్రసంతి గౌరవాధ్యక్షులు తెలకపల్లి రవి, ప్రధాన కార్యదర్శి కెంగర మోహన్ సంతాపం తెలిపారు.

సొసైటీలలో సాగేతర వ్యాపారం

- మల్టీపర్పస్ ఉద్దేశం ఇదే
- వాటర్ బాట్లింగ్ నుంచి బడ్డీకొట్ల వరకు అనుమతి
- సూపర్‌బజార్లు, మెడికల్ షాపులు, పెట్రోల్ బంక్‌లు సైతం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు (పిఎసిఎస్/ప్యాక్స్) ఇప్పటి వరకు రైతులకు అవసరమైన వ్యవసాయ సంబంధ కార్యకలాపాలు నిర్వహించగా, ఇకపై సాగేతర వ్యాపార కేంద్రాలుగా మారనున్నాయి. తాగునీటిని శుద్ధి చేసే ఆర్‌ఒ ప్లాంట్లు, మంచినీటి బాట్లింగ్ ప్లాంట్లు, జనరిక్ ఔషధ కేంద్రాలు, అన్ని రకాల పచారీ, ఇతర వస్తువులు అమ్మే సూపర్ బజార్లు, బడ్డీకొట్లు, సామిల్లులు, కార్పెంటరీ, కాటన్ జిన్నింగ్, పెట్రోల్ బంక్‌లు, ఇత్యాది వ్యాపారాలను సహకార సొసైటీలలో అనుమతించారు. పంట రుణాలతో పాటు వెహికిల్ లోన్లు (కిసాన్ బైక్స్), పర్సనల్ లోన్లు, ఆభరణాలపై రుణాల వంటి వాటికీ సై అన్నారు. పిఎసిఎస్‌లు స్వయం సమృద్ధి సాధించాలంటే వ్యవసాయేతర వ్యాపారాలు చేయక తప్పదని నిర్దేశించారు. ఇప్పటి వరకు ప్యాక్స్ లేని పంచాయతీల్లో ప్యాక్స్‌ను నెలకొల్పుతామని మొన్న బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. పిఎసిఎస్‌లను బహుళ సేవా కేంద్రాలు (మల్టీపర్పస్ సర్వీస్ సెంటర్స్-ఎంఎస్‌సి)గా తీర్చిదిద్దుతామని, సొసైటీల్లో 25 రకాల వ్యాపారాలు నిర్వహించేలా మోడల్ బైలాస్‌ను రూపొందించింది. మరో వైపు రాష్ట్ర ప్రభుత్వం పిఎసిఎస్‌లను రైతు భరోసా కేంద్రాలతో లింక్ చేసి బహుళ ప్రయోజన సేవ కేంద్రాల (ఎంపిఎఫ్‌సి)ను నిర్మిస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సొసైటీలను బిజినెస్ సెంటర్లుగా మారుస్తున్నాయి.

ఆప్కాబ్‌లో ప్రత్యేక విభాగం

ఆప్కాబ్‌లో 2013లోనే ప్యాక్స్-ఎంఎస్‌సి కార్యాచరణకు నాబార్డు నేతృత్వంలో ప్రత్యేక విభాగం ప్రారంభమైంది. ఇప్పుడు ఆ డిపార్ట్‌మెంట్ పనులు ఊపందుకున్నాయి. ఆ విభాగం నాబార్డు, ఆప్కాబ్ సమన్వయంతో పని చేస్తుంది. పిఎసిఎస్‌లను మల్టీ సర్వీస్ కేంద్రాల వైపు తీసుకురావడం, అందుకు అవసరమైన రుణాలపై అంచనా వేసి ఆప్కాబ్ ద్వారా నాబార్డుకు రుణం కోసం సిఫారసులు పంపడం ప్రాజెక్టు మోనెటరింగ్ యూనిట్ (పిఎంయు) పని. రాష్ట్రంలో 2 వేలకు పైన ప్యాక్స్ ఉండగా 238 ప్యాక్స్‌ను మల్టీ కేంద్రాలుగా మార్చాలని నిర్ణయించారు. ప్యాక్స్, వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఎంఎంసి) భూములను సేకరించి నిర్మాణాలు చేస్తున్నారు. మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో నిర్మాణాలు చేపడుతున్నారు. గోదాములు, డ్రయ్యర్ యార్డ్‌తోపాటు అనుమతించిన వ్యాపారాలకు అనుగుణంగా నిర్మాణాలు చేస్తున్నారు.

అంతా రుణమే

మల్టీపర్పస్ సెంటర్ల నిర్మాణానికి అవసరమైన వ్యయంలో ప్రధానంగా రుణమే ఉంది. రెండు కాంపొనెంట్‌లలో నాబార్డు, ఆప్కాబ్ నుంచి పిఎసిఎస్‌లకు లోన్ అందుతుంది. ఒకటి టర్మ్‌లోన్ కాగా రెండవది వర్కింగ్ క్యాపిటల్ లోన్. టర్మ్‌లోన్‌ను ఐదు నుంచి ఏడేళ్లల్లో సొసైటీ చెల్లించాలి. వర్కింగ్ క్యాపిటల్ లోన్‌ను మూడేళ్లల్లో చెల్లించాలి. సెంటర్ల ఏర్పాటుకు అయ్యే ఖర్చులో రుణం పోను కొంత మొత్తం సొసైటీ భరించాలి. కాగా సొసైటీల్లో ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు, వ్యవసాయ రుణాలు ఇవ్వడం కద్దు. వ్యవసాయ యంత్రాలను అద్దెకిచ్చేందుకు కస్టమ్ హైర్ సెంటర్ల కోసం రుణాలివ్వడం వరకు అర్థం చేసుకోవచ్చు. కానీ సాగేతర బిజినెస్‌కు అనుమతించడం కార్పొరేట్, ప్రైవేటు కోసమే. ప్యాక్స్ రుణం తీసుకొని మౌలిక సదుపాయాలు కల్పిస్తే ప్రైవేటు కంపెనీలు వాటిని అప్పనంగా వినియోగించుకొని తమ వ్యాపారం చేసుకుంటాయి.

మరో 'షాక్'

- రూ.3,083 కోట్ల ట్రూఅప్ భారం
- ఏడాదిలో మూడోసారి
- వచ్చే నెల నుంచి అమలు

• లోపలి పేజీలో.. •

సంపదపై దురాశ వల్లే అవినీతి క్యాన్సర్

- సామాజిక న్యాయం కల్పనలో తీవ్ర అవరోధం
- సుప్రీంకోర్టు ధర్మాసనం

ప్రమాదంలో ప్రజాస్వామ్యం



- పత్రికా స్వేచ్ఛ, న్యాయ వ్యవస్థపై నిర్బంధం
- కేంబ్రిడ్జ్ యూనివర్సిటీలో రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ : భారత్‌లో ప్రజాస్వామ్యంపై కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉన్నదని అన్నారు. తనతోపాటు అనేకమంది రాజకీయ నాయకులపై నిఘా ఉన్నదని తెలిపారు. ఇందుకు ప్రభుత్వం పెగాసస్ స్పైవేర్‌ను ఉపయోగిస్తున్నదని చెప్పారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన కేంబ్రిడ్జ్ యూనివర్సిటీలో విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించిన ఆయన పై వ్యాఖ్యలు చేశారు. దీనికి సంబంధించిన వీడియోను కాంగ్రెస్ నాయకులు, భారత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మాజీ సలహాదారు అయిన శామ్ పిట్రోడా ట్విట్టర్‌లో షేర్ చేశారు.

ఇజ్రాయిల్‌కు చెందిన స్పైవేర్ పెగాసస్ తనతోపాటు అనేక మంది రాజకీయ నాయకుల ఫోన్‌లలో ఇన్‌స్టాల్ అయినట్లు రాహుల్ గాంధీ తెలిపారు. నా ఫోన్‌లోనూ పెగాసస్ ఉన్నదనీ, ఈ విషయంలో కొందరు నిఘా అధికారులు నన్ను పిలిచి జాగ్రత్తగా ఉండాలనీ, ఫోన్‌లో తానేమి మాట్లాడినా రికార్డింగ్ చేస్తున్నామని చెప్పారని రాహుల్ అన్నారు.

ప్రజాస్వామ్యానికి కావాల్సిన సంస్థాగత ప్రక్రియ పార్లమెంట్, పత్రికా స్వేచ్ఛ, న్యాయవ్యవస్థ వంటివి నిర్బంధించబడుతున్నాయని రాహుల్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య ప్రాథమిక నిర్మాణంపై దాడిని మనం ఎదుర్కొంటున్నామని తెలిపారు. భారత్ అనేది రాష్ట్రాల కలయిక అని రాజ్యాంగంలో పేర్కొనబడిందనీ, చర్చలు, సంభాషణలు అవసరమని అన్నారు. భారత్‌లో పత్రికలు, మైనారిటీలపై దాడులు జరుగుతున్నాయని చెప్పారు. తనపై అనేక సంఖ్యలో క్రిమినల్ కేసులు నమోదయ్యాయని అన్నారు. మీడియా, ప్రజాస్వామ్య నిర్మాణంపై ఇలాంటి దాడి జరుగుతున్నప్పుడు ఒక ప్రతిపక్ష నేతగా ప్రజలతో ఆలోచనలు పంచుకోవడం చాలా కష్టమని రాహుల్ తెలిపారు.

పెట్టుబడులకు గమ్యస్థానంగా రాష్ట్రం

గ్లోబల్ ఇన్వెస్టర్ల సమ్మిట్‌లో పారిశ్రామిక దిగ్గజాల ఉద్ఘాటన

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ప్రపంచ పారిశ్రామిక రంగ చిత్ర పఠంలో ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక గుర్తింపు తెచ్చేలా ఆధునిక రంగాల్లో ఇక్కడ పెట్టుబడులకు అవకాశాలున్నాయని పలువురు పారిశ్రామిక వేత్తలు అభిప్రాయపడ్డారు. అపారమైన సహజ వనరులు గల రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడం ద్వారా ఉపాధి అవకాశాలు పెంచడానికి తాము సిద్ధంగా ఉన్నామని గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌లో పాల్గొన్న పలువురు పారిశ్రామిక వేత్తలు వెల్లడించారు. విశాఖలో తొలిరోజు ప్రారంభమైన సమ్మిట్‌లో రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీ మాట్లాడుతూ.. ఎపిలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించడమంటే ఒక బహుమతిగా ఎవరైనా భావిస్తారని అన్నారు. డిజిటల్ నెట్‌వర్క్ రంగంలో రూ.40 వేల కోట్లు పెట్టుబడులు పెడుతున్నామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో 4జి నెట్‌వర్క్ సేవలు 98 శాతం ఉన్నాయని, 2023 చివరి నాటికి ఎపి సహా దేశ వ్యాప్తంగా 5జి సేవలను అందుబాటులోకి తెస్తామన్నారు. అదానీ పోర్ట్స్ సిఇఒ కరణ్ అదానీ మాట్లాడుతూ.. ఎపిలో అద్భుతమైన వనరులు, మౌలిక వసతులు, ప్రతిభావంతులైన యువత, వ్యాపార అనుకూల వాతావరణం ఉందని కొనియాడారు. ఈ సమ్మిట్‌కు తమను ఆహ్వానించడాన్ని ఎంతో గౌరవంగా భావిస్తున్నామన్నారు. అదానీ పోర్ట్సు నిర్వహణలో ఉన్న



సమ్మిట్‌లో మాట్లాడుతున్న ముఖేష్ అంబానీ

గంగవరం, కృష్ణపట్నం పోర్టుల్లో వంద మిలియన్ టన్నులకు కెపాసిటీని త్వరలోనే తీసుకెళతామన్నారు. ఇప్పటికే రూ.20 వేల కోట్ల పెట్టుబడి పెట్టి 18 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పించామని తెలిపారు. జిఎంఆర్ గ్రూప్ అధినేత గ్రంధి మల్లికార్జునరావు మాట్లాడుతూ.. తాను ఈ రాష్ట్రం బిడ్డను అంటూ గర్వంగా చెప్పుకుంటున్నానని అన్నారు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ పారదర్శకత కలిగిన నాయకత్వం ఉందని, పెట్టుబడులకు ఇదే సరైన సమయమని తెలిపారు. పెట్టుబడులకు భవిష్యత్ గమ్యస్థానంగా రాష్ట్రం నిలదొక్కుకుంటోందన్నారు. భోగాపురం ఎయిర్ పోర్టును ఫేజ్ 1లో ఆరు బిలియన్ ప్రయాణికులతో అందుబాటులోకి తెస్తామన్నారు.ఇందుకు రూ.ఐదు వేల కోట్లు ఖర్చు అవుతుందని తెలిపారు. భోగాపురం పరిసరాల్లో విమానాశ్రయానికి అనుబంధంగా ఎయిర్ పోర్టు సిటీ, ఇండస్ట్రియల్, ఎడ్యుకేషన్ జోన్‌లు రానున్నాయన్నారు. జిందాల్ స్టీల్ అండ్ పవర్ లిమిటెడ్ అధినేత నవీన్ జిందాల్ మాట్లాడుతూ.. ఎపితో కలిసి పనిచేయడం గొప్ప అనుభవంగా భావిస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఆరు నెలల్లో 600 మెగావాట్ల ఎనర్జీ ఉత్పత్తి చేసి త్వరలో కమిషన్ చేయబోతున్నట్లు ప్రకటించారు. తన సోదరుని సంస్థ అయిన జెఎస్‌డబ్ల్యు ఎపిలో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెడుతుందని తెలిపారు. గత నెలలో కడప స్టీల్‌ప్లాంట్‌కు శంకుస్థాపన చేశామన్నారు. రెన్యువబుల్ ఎనర్జీలో ఇంకా పెట్టుబడులు పెట్టబోతున్నామని చెప్పారు. జెఎస్‌పి, జెఎస్‌డబ్ల్యు గ్రూపులతో తాము రాష్ట్రంలో భాగస్వాములుగా ఉంటామన్నారు. సమ్మిట్‌లో భారత్ బయోటెక్ ప్రతినిధి కృష్ణా ఎల్లా, అపోలో వైస్ చైర్మన్ గీతారెడ్డి, బివిఆర్.మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి అతిథులను వేదికపైకి ఆహ్వానించారు.

తల్లుల ఖాతాల్లో వద్దు

'అమ్మఒడి'పై ప్రైవేటు విద్యా సంస్థలు పిటిషన్లు

ప్రజాశక్తి-అమరావతి

విద్యా హక్కు చట్టం కింద ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లకు అమ్మఒడి ఫీజుల వ్యవహారంపై ప్రభుత్వం జారీ చేసిన జిఒ 24ను సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. ఇండిపెండెంట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షులు కోగంటి శ్రీకాంత్, యునైటెడ్ ప్రైవేట్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ ఫెడరేషన్ చైర్మన్ గొల్లపూడి మోహనరావు దాఖలు చేసిన పిటిషన్లను జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ శుక్రవారం విచారణ జరిపారు. పేదలకు 25 శాతం ఉచిత సీట్లు పొందే పిల్లల తల్లిదండ్రులు అమ్మఒడి పథకం చెల్లించే మొత్తం నుంచే ఫీజులు చెల్లించుకోవాలన్న జిఒను కొట్టేయాలని పిటిషనర్ల వాదన. ఫీజులను తల్లుల ఖాతాల్లో కాకుండా నేరుగా పాఠశాలలకు చెల్లించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు. 25 శాతం కోటా సీట్ల ఫీజులపై ప్రభుత్వం నిర్ణయం సరిగ్గాలేదన్నారు. కౌంటర్ దాఖలు చేయాలని పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి, కమిషనర్లను ఆదేశించిన హైకోర్టు విచారణను ఈ నెల 15కు వాయిదా వేసింది.

నిపుణుల కమిటీకి నివేదించాలి..

పోలీస్ కానిస్టేబుల్ రాత పరీక్ష ప్రిలిమ్స్‌లో 8 ప్రశ్నలకు జవాబులు సరిగ్గా లేనందున ఈ వ్యవహారాన్ని నిపుణుల కమిటీ ముందుంచాలని దాఖలైన కేసులో ప్రతివాదులకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. పూర్తి వివరాలను తమకు నివేదించాలని పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్, హోంశాఖ ముఖ్య కార్యదర్శులను ఆదేశిస్తూ.. జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు ఆదేశాలిచ్చారు. విచారణను ఈ నెల 7కు వాయిదా వేశారు.

ఇంటి వద్దే 'నారాయణ' విచారణ

అమరావతి మాస్టర్ ప్లాన్, ఇన్నర్ రింగ్ రోడ్ అలైన్‌మెంట్ డిజైన్లు మార్పు చేసి అక్రమాలకు పాల్పడ్డారని సిఐడి దాఖలు చేసిన కేసుల్లో నిందితులుగా ఉన్న మాజీ మంత్రి పి నారాయణ, ఆయన భార్య రమాదేవి, నారాయణ విద్యా సంస్థ అకడమిక్ డైరెక్టరు పొత్తూరు ప్రమీలకు హైకోర్టులో ఊరట లభించింది. సుప్రీం కోర్టు మార్గదర్శకాల ప్రకారం మహిళలను ఇళ్ల వద్దనే విచారించాలని జస్టిస్ కె శ్రీనివాస్‌రెడ్డి సిఐడిని ఆదేశించారు. గతంలోని ఉత్తర్వుల ప్రకారం నారాయణను కూడా ఆయన ఇంటి వద్దే విచారించాలని ఉత్తర్వులు జారీ చేశారు. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది దమ్మాలపాటి శ్రీనివాస్ వాదించారు. సిఐడి నోటీసులను కొట్టేయాలని కోరారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

అప్పిలేట్ లేక ఆర్‌టిసి ఉద్యోగులు విలవిల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

చిన్న చిన్న విషయాల్లో క్రమశిక్షణ చర్యలకు గురైన ఆర్‌టిసి ఉద్యోగులకు తమ సమస్యను చెప్పుకునే వ్యవస్థ ప్రభుత్వంలో విలీనమయ్యాక లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వంలో విలీనం కాకముందు ఆర్‌టిసి ఉద్యోగులకు ఏదైనా సమస్య వస్తే డిపో స్థాయిలోనూ రీజనల్ స్థాయి, జోనల్ స్థాయిలో పరిష్కారం లభించేది. ఇప్పుడు ఆర్‌టిసి ఉద్యోగులంతా ప్రభుత్వ ఉద్యోగులు అవడంతో.. తమ పరిధిలో లేని అంశం అని ఆర్‌టిసి అధికారులు చెబుతుండటంతో తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఆర్‌టిసిలో ఇటీవల కాలంలో ఉద్యోగులపై అకారణంగా ఇంక్రిమెంట్లు నిలిపేయడం, సస్పెన్షన్లు, రిమూవల్స్ పెరిగిపోయాయి.

ఆర్‌టిసి ఉద్యోగ భద్రతా ప్రమాణాలను ఉల్లంఘించి చర్యలు తీసుకుంటున్న తీరును ఆర్‌టిసిలోని ఉద్యోగ సంఘాలన్నీ తప్పుపడుతున్నాయి. ప్రభుత్వంలో విలీనమయ్యాక ఈ రెండేళ్ల కాలంలో దాదాపు 200 మంది ఉద్యోగులు క్రమశిక్షణ చర్యలకు గురయ్యారు. గతంలో క్రమశిక్షణ చర్యలకు గురైన ఉద్యోగులు అప్పీల్ చేసుకుంటే విచారణ జరిపి చిన్నపాటి పనిష్మెంట్లతో మళ్లీ ఉద్యోగ అవకాశం వెంటనే కల్పించేవారు. ఈ రెండేళుగా ఎలాంటి అప్పిలేట్ వ్యవస్థ లేకపోవడంతో తమ సమస్యను ఎలా పరిష్కరించుకోవాలో అర్థంకాక నెలల తరబడి ఎలాంటి వేతనాలు రాక ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఆత్మహత్యలు తప్ప ఉద్యోగులకు మరో మార్గం లేదని ఉద్యోగ సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ఆర్‌టిసిలో ఇటువంటి సమస్యలను పరిష్కరించేందుకు జిల్లాల్లో అధికార యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని ఎస్‌డబ్ల్యుఎఫ్ డిమాండ్ చేస్తోంది. తక్షణం అప్పిలేట్ అధికారులను నియమించి, ఉద్యోగుల అప్పీల్స్‌ను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఎస్‌డబ్ల్యుఎఫ్ డిమాండ్ చేసింది.

ప్రజాగళం వినిపించే రమాప్రభను గెలిపించండి

వెబ్‌సైట్ ప్రారంభంలో ప్రొఫెసర్ కెఎస్ చలం

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

ప్రజా సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలిపించాల్సిన అవసరముందని యుపిఎస్‌సి మాజీ చైర్మన్ ప్రొఫెసర్ కెఎస్ చలం అన్నారు. విశాఖలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో https://www.drkoredlaramaprabha.in వెబ్‌సైట్‌ను శనివారం ఆయన ఆవిష్కరించారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో చలం మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటివరకూ అధికారంలో ఉన్న పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులెవరూ ఉత్తరాంధ్ర అభివృద్ధికి చర్యలు చేపట్టలేదని అన్నారు. రాష్ట్ర విభజన తరువాత ఈ ప్రాంతం మరింత వెనుకబాటుకు నెట్టబడిందని తెలిపారు. స్టీల్‌ప్లాంటు అమ్మకం, రాష్ట్ర విభజన చట్టం అమలు, రైల్వే జోన్, మెట్రో రైలు, ఉత్తరాంధ్ర ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ వంటి అంశాలపై ఉత్తరాంధ్ర గళాన్ని చట్ట సభల్లో బలంగా వినిపించే రమాప్రభను గెలిపించేలా పట్టభద్రులు చైతన్యం ప్రదర్శించాలని కోరారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పిడిఎఫ్ ఎమ్మెల్సీలు నిస్వార్థంగా, నిజాయితీగా ప్రజల పక్షాన నిలుస్తున్నారన్నారు. వారి ద్వారానే చట్ట సభల్లో ప్రజల సమస్యలు చర్చకు వస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర జర్నలిస్టుల ఫ్రంట్ అధ్యక్షులు ఎన్ నాగేశ్వరరావు, పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ అజశర్మ, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కెఎస్ చలం, వేదికపై ఎమ్మెల్సీ ఐవి, నాగేశ్వరరావు, అజశర్మ, రమాప్రభ

పట్టభద్రుల దొంగ ఓట్లను తొలగించండి

- సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ నేతల డిమాండ్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో దొంగ ఓట్లను తొలగించాలని, దొంగ ఓట్ల నమోదుకు సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం సిపిఎం కార్యాలయంలో సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు వందవాసి నాగరాజు, పి.మురళి, పిసిసి కార్యదర్శి యార్లపల్లి గోపి విలేకరులతో మాట్లాడారు. తిరుపతిలోని ప్రతి డివిజన్‌లో దాదాపు 300, జిల్లావ్యాప్తంగా ఏడువేల దొంగ ఓట్లు ఉన్నాయని విమర్శించారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ చదివిన వారికి కూడా అధికారులు ఓటు హక్కు కల్పించారని తెలిపారు. దొంగ ఓట్లు తొలగించాలని ఆధారాలతో సహా గతంలో అధికారులకు ఫిర్యాదు చేసినా తొలగించకపోవడం అన్యాయమన్నారు. దొంగ ఓట్లను తొలగించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని, నిజమైన పట్టభద్రులు ఓటును వేసేలా ప్రశాంత వాతావరణం కల్పించాలని కలెక్టర్‌ను, ఎస్‌పిని కోరారు.

మరో 'షాక్'

- రూ.3,083 కోట్ల ట్రూఅప్ భారం
- ఏడాదిలో మూడోసారి
- వచ్చే నెల నుంచి అమలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం భారాల మీద భారాలు మోపుతూ విద్యుత్ వినియోగదారుల నడ్డి విరుస్తోంది. ఇప్పటికే ఏడాది కాలంలో రెండు సార్లు ఛార్జీలు పెంచిన ప్రభుత్వం.. ముచ్చటగా మూడోసారి కూడా ఛార్జీలు పెంచుతూ షాక్ ఇచ్చింది. విద్యుత్ పంపిణీ సంస్థలు ప్రతిపాదించిన రూ.3082.99 కోట్ల సర్దుబాటు (ట్రూ అప్) ఛార్జీలకు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఎపిఇఆర్‌సి) తాజాగా అనుమతిచ్చింది. 2021-22 ఆర్థిక సంవత్సరంలో మొదటి త్రైమాసికంలో రూ.314.17 కోట్లు, రెండో త్రైమాసికంలో రూ.949.93 కోట్లు, మూడో త్రైమాసికంలో రూ.784.74 కోట్లు నాల్గవ త్రైమాసికంలో రూ.1,034.15 కోట్ల చొప్పున నష్టం వచ్చినట్లు పేర్కొంది. 60313.2 మిలియన్ యూనిట్లు (ఎంయు) విద్యుత్ అమ్మకాలు చేసినట్లు వెల్లడించింది. ఈ ట్రూఅప్ వసూలు చేసుకునేందుకు ఎపిఇఆర్‌సి అనుమతిచ్చింది. దీని ప్రకారం ఎపిఎస్‌పిడిసిఎల్ వినియోగదారులపై రూ.1,199.97 కోట్లు, ఎపిఇపిడిసిఎల్ వినియోగదారులపై రూ.1,165.24 కోట్లు, ఎపిసిపిడిసిఎల్ వినియోగదారులపై రూ.717.77 కోట్లు చొప్పున భారం పడనుంది. రూ.3,082.99 కోట్లను 2023-24 ఆర్థిక సంవత్సరంలో వినియోగదారుల నుంచి వసూలు చేసుకునేందుకు డిస్కమ్‌లకు ఇఆర్‌సి అనుమతిచ్చింది. ఇప్పటికే డిస్కమ్‌లు రూ.2,900 కోట్ల భారాన్ని వినియోగదారుల వద్ద గతేడాది ఆగస్టు నుంచి వసూలు చేస్తున్నాయి.

ఇది 36 నెలలపాటు ఎస్‌పిడిసిఎల్ యూనిట్‌కు 0.23 పైసలు చొప్పున, 0.22 పైసలు చొప్పున సిపిడిసిఎల్, 18 నెలల పాటు ఇపిడిసిఎల్ 0.07 పైసలు చొప్పున వినియోగదారులు చెల్లిస్తున్నారు. ఇప్పుడు కొత్తగా మోపిన రూ.3,088.99 కోట్లతో ఎస్‌పిడిసిఎల్ వినియోగదారులు వచ్చే ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో యూనిట్‌కు అదనంగా 0.2017 పైసలు, రెండో త్రైమాసికంలో 0.6325 పైసలు చొప్పున, మూడో త్రైమాసికంలో 0.5772 పైసలు, నాల్గవ త్రైమాసికంలో 0.6654 పైసలు చొప్పున చెల్లించాలి.

ఇపిడిసిఎల్ వినియోగదారులు మొదటి త్రైమాసికంలో 0.1975 పైసలు, రెండో త్రైమాసికంలో 0.6194 పైసలు, మూడో త్రైమాసికంలో 0.5652 పైసలు, నాల్గవ త్రైమాసికంలో 0.6455 పైసలు చొప్పున భారం పడనుంది. సిపిడిసిఎల్ వినియోగదారుల మొదటి త్రైమాసికంలో 0.2010 పైసలు, రెండో త్రైమాసికంలో 0.6304 పైసలు, మూడో త్రైమాసికంలో 0.5753 పైసలు, నాల్గవ త్రైమాసికంలో 0.6633 పైసలు చొప్పున భారం మోయాలి. ఈ లెక్కన మొదటి త్రైమాసికంలో 100 యూనిట్ల విద్యుత్ వాడే ఎస్‌పిడిసిఎల్ వినియోగదారులు కొత్త ఛార్జీల ప్రకారం అదనంగా రూ.43, ఇపిడిసిఎల్ వినియోగదారులు రూ.26, సిపిడిసిఎల్ వినియోగదారులు రూ.42 చొప్పున చెల్లించాలి. రెండో త్రైమాసికంలో ఎస్‌పిడిసిఎల్ వినియోగదారులు రూ.86, ఇపిడిసిఎల్ రూ.70, సిపిడిసిఎల్ రూ.85 చొప్పున అదనంగా చెల్లించాలి.

యూనిట్ చొప్పున అదనంగా పడనున్న ట్రూఅప్ భారం (పైసల్లో)

	ఎస్‌పిడిసిఎల్	ఇపిడిసిఎల్	సిపిడిసిఎల్
ఏప్రిల్ నుంచి జూన్ వరకు	0.43	0.26	0.42
జులై నుంచి సెప్టెంబర్ వరకు	0.8625	0.70	0.85
అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు	0.80	0.63	0.79
జనవరి నుంచి మార్చి వరకు	0.89	0.71	0.88

'ఉపాధి' నిధుల కోసం ఎదురుచూపులు

- రాష్ట్రంలో లక్ష్యాన్ని మించి పనులు
- రోజుకు ఒక్కొక్కరికీ సరాసరి రూ.210 వేతనం

ప్రజాశక్తి- అమరావతి బ్యూరో

ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు కొన్ని రోజులు మాత్రమే గడువు ఉన్నప్పటికీ అదనంగా చేసిన పనులకు సంబంధించి రాష్ట్రానికి రావాల్సిన రూ.3,489.86 కోట్ల నిధుల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఉపాధి హామీ పథకానికి కేంద్ర ప్రభుత్వం 2022-23కు 20.20 కోట్ల పనిదినాలు లక్ష్యంగా నిర్దేశించగా, 21,49,056 కోట్ల పనిదినాలు పూర్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం అప్రూవల్ చేసిన పనిదినాల కంటే రూ.1.29 కోట్ల పనిదినాలు అధికంగా రాష్ట్రంలో పనులు జరిగాయి. ఈ పనులు 106 శాతంగా రికార్డుల్లో నమోదైంది. కేటాయించిన నిధులకు రూ.6,757.49 కోట్లు శాంక్షన్ చేయగా, ఇందులో ఉపాధి కార్మికుల వేతనాలు రూ.4,557.65 కోట్లు, మెటీరియల్ కాంపోనెంట్ కింద రూ.2,913.60 కోట్లు కేటాయించారు. కాంపోనెంట్ నిధులను ఎర్త్‌వర్క్, సిసి రోడ్లు, బిల్డింగులు, డ్రైన్లు వంటి పనులకు వినియోగిస్తారు. కేంద్రం నిర్దేశించిన లక్ష్యం ప్రకారం రాష్ట్రానికి కేటాయించిన నిధులకు మదర్ శాంక్షన్ రూ.4,359.30 కోట్లు కాగా, ఇప్పటి వరకు రూ.3,943.57 కోట్లు కార్మికుల వేతనాలుగా వారి అకౌంట్లలో జమచేశారు. 26 జిల్లాల్లో 69.54 లక్షల మంది కార్మికులకు జాబ్ కార్డులివ్వగా, ఇందుకు సంబంధించి 1.24 కోట్ల మంది కూలీలు ఉన్నారు. ఇందులో 56.50 కోట్ల మంది యాక్టివ్ కార్మికులుగా ఉన్నారు. ఉపాధి పనులు చేస్తున్న కార్మికుల్లో 60 శాతం మంది మహిళలు ఉన్నారు. రాష్ట్రంలో 100 రోజుల పనిదినాలు పూర్తి చేసిన కార్మికులు 1,18,657 మంది ఉండగా, సరాసరిన లెక్కిస్తే ఏడాది మొత్తమ్మీద ఒక్కొక్క కుటుంబం 48 రోజులు పనిచేసినట్లు గణాంకాల ద్వారా తెలుస్తోంది. ఒక్కో కార్మికునికి రోజుకు రూ.257 ఇవ్వాల్సి ఉండగా, ఆంధ్రప్రదేశ్‌లో సరాసరి రూ.210.50 వంతున వేతనాలు చెల్లిస్తున్నారు.

తెలంగాణలో దారుణం

- భార్య కళ్ల ముందే భర్తను కత్తులతో పొడిచి హత్య

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్రం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో దారుణం జరిగింది. ప్రేమ వివాహం చేసుకుందనే కోపంతో యువతి కుటుంబ సభ్యులు యువకుడిని కత్తులతో పొడిచి హత్య చేశారు. అనంతరం యువతిని వారి వెంట తీసుకెళ్లారు. రెండ్రోజుల కింద జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం... దూలపల్లిలోని సూరారం కాలనీలో హరీష్ (28) కుటుంబం ఆరు నెలలుగా నివాసం ఉంటోంది. గతంలో ఎర్రగడ్డలో ఆయన నివాసం ఉన్న సమయంలో ఓ అమ్మాయిని ప్రేమించారు. ఆ యువతి ఈ విషయాన్ని తన తల్లిదండ్రులకు తెలియడంతో వారు హరీష్‌ను హెచ్చరించారు. దీంతో, ఆయన దూలపల్లికి మకాం మార్చాడు. అక్కడ ఓ ఇంట్లో తల్లితో కలిసి ఉంటున్నారు. అయితే, గతంలో ప్రేమించిన అమ్మాయినే వివాహం చేసుకున్నారు. దీంతో, హరీష్‌పై పగ పెంచుకున్న అమ్మాయి కుటుంబ సభ్యులు ఆయనను ఎలాగైనా అంతం చేయాలని పథకం వేశారు. ఇందుకోసం వారి కదిలికలపై నిఘా పెట్టారు. రెండ్రోజుల కిందట దూలపల్లి వద్ద దంపతులను గమనించి హరీష్‌ను కత్తులతో పొడిచి దారుణంగా హత్య చేశారు. అనంతరం అమ్మాయిని తమతోపాటు తీసుకెళ్లారు. పేట్ బషీరాబాద్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. ప్రేమ వివాహమే హరీష్ హత్యకు కారణమని పోలీసులు తెలిపారు. ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. తన చెల్లి వెంట పడొద్దని హరీష్‌ను యువతి సోదరుడు ఇదివరకే హెచ్చరించాడని పోలీసులు తెలిపారు. ప్రేమ, పెళ్లి విషయంలో ఇరు కుటుంబాల మధ్య గొడవలు జరిగాయని చెప్పారు. అయినా, హరీష్ అమ్మాయిని వివాహం చేసుకోవడంతో యువతి సోదరుడు పగ పెంచుకున్నాడని తెలిపారు.

పట్టాభి సహా 13 మందికి బెయిల్

ప్రజాశక్తి - గన్నవరం (ఎన్‌టిఆర్ జిల్లా)

టిడిపి జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్‌కు బెయిల్ మంజూరైంది. కస్టడీకి ఇవ్వాలని పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌ను విజయవాడ ఎస్‌సి, ఎస్‌టి ప్రత్యేక కోర్టు తిరస్కరించింది. బెయిల్‌పై పట్టాభిని విడుదల చేయాలని ఆదేశించింది. కృష్ణాజిల్లా గన్నవరం ఘటన కేసులో పట్టాభిపై పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. బెయిల్ పిటిషన్‌పై గురువారం విజయవాడ కోర్టులో వాదనలు ముగిశాయి. పట్టాభి తరపున సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు వాదనలు వినిపించారు. ఇరువైపులా వాదనలు విన్న న్యాయమూర్తి.. పట్టాభి సహ 13 మంది టిడిపి నేతలకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేశారు. మూడు నెలలపాటు ప్రతి గురువారం పోలీసు స్టేషన్‌లో హాజరు కావాలని బెయిల్ నిబంధనల్లో పేర్కొన్నారు. తుది ఉత్తర్వుల నిమిత్తం కేసును న్యాయమూర్తి ఎ.సత్యానంద్ శుక్రవారానికి వాయిదా వేశారు.

సిఐ ఫిర్యాదు మేరకు కేసు నమోదు

గన్నవరం సిఐ కనకారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టాభిపై పోలీసులు కేసు నమోదు చేశారు. టిడిపి కార్యకర్తలను రెచ్చగొట్టడం ద్వారా తనకు పట్టాభి సహా ఇంకొందరు టిడిపి నేతలు ప్రాణహాని కలిగించే ప్రయత్నం చేశారని కనకారావు ఫిర్యాదు చేశారు. తనను కులం పేరుతో దూషించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పట్టాభి, చిన్నా సహా మొత్తం 13 మందిపై హత్యాయత్నం, ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. కోర్టుకు సమర్పించిన రిమాండ్ రిపోర్టులో గన్నవరం పోలీసులు ఈ మేరకు పేర్కొన్నారు.


ఎంఒయుల కార్యక్రమంలో సిఎం జగన్, అంబానీ, పెద్దిరెడ్డి

తొలిరోజు ఉత్సాహంగా ఒప్పందాలు

- రూ.11 లక్షల కోట్ల విలువైన 92 ఎంఒయులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ వేదికగా ప్రారంభమైన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ - 2023లో శుక్రవారం తొలి రోజు ఉత్సాహంగా పెట్టుబడుల ఒప్పందాలు జరిగాయి. మొదటి రోజే రూ.11 లక్షల కోట్ల మేర పెట్టుబడులు వచ్చాయి. 'కొత్త ఆంధ్రప్రదేశ్ - అడ్వాంటేజ్ ఆంధ్రప్రదేశ్' అన్న నినాదంతో నిర్వహిస్తున్న ఈ సమ్మిట్‌లో మొత్తం 64 కంపెనీలు 92 అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేశాయి. తద్వారా రాష్ట్రంలో సుమారు 4 లక్షల మందికి ఉపాధి లభించనుందని ప్రభుత్వం ప్రకటించింది. ఒప్పందాలను పరిశీలిస్తే.. ఇంధన శాఖ రూ.6.25 లక్షల కోట్ల పెట్టుబడితో 35 పెట్టుబడి ప్రతిపాదనలను ఆకర్షించి 1.33 లక్షల మందికి ఉపాధిని కల్పించేందుకు ఎంఒయు జరిగింది. పరిశ్రమలు, వాణిజ్య శాఖ రూ.3.20 లక్షల కోట్ల పెట్టుబడితో దాదాపు 41 ప్రతిపాదనల ద్వారా 1.79 లక్షల మందికి ఉపాధిని సృష్టించనుంది. ఐటి, ఐటిఇఎస్ శాఖ రూ.32.944 కోట్ల పెట్టుబడితో ఆరు ప్రతిపాదనల ద్వారా 64,815 మందికి ఉపాధిని కల్పించేందుకు అవగాహన ఒప్పందాలు చేసుకుంది. పర్యాటక శాఖ రూ.8,718 కోట్లతో 13,400 మందికి ఉపాధి కల్పించే పది ప్రతిపాదనలతో ముందుకు వచ్చింది. ప్రధాన పెట్టుబడిదారులలో నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్‌టిపిసి) రూ.2,35,000 కోట్ల పెట్టుబడితో మూడు అవగాహన ఒప్పందాలపై సంతకం చేసింది. తద్వారా 77 వేల మందికి ఉపాధిని కల్పించనుంది. జెఎస్‌డబ్ల్యు గ్రూప్ 6 అవగాహన ఒప్పందాలతో రూ.50,632 కోట్ల పెట్టుబడితో 9,500 మందికి ఉపాధిని ఒప్పందం కుదుర్చుకుంది. ఎబిసి లిమిటెడ్ రూ.1.20 లక్షల కోట్ల పెట్టుబడితో ఒక ఒప్పందంపై సంతకం చేసి, ఆంధ్రప్రదేశ్‌లోని ఏడు వేల మందికి ఉపాధిని కల్పిస్తామని పేర్కొంది. అరబిందో గ్రూప్ రూ.10,365 కోట్ల పెట్టుబడితో ఐదు అవగాహన ఒప్పందాలపై సంతకం చేసింది. దీని ద్వారా 5,250 మందికి ఉపాధి లభిస్తుందని తెలిపింది. అదానీ గ్రీన్ ఎనర్జీ రూ.21,820 కోట్ల పెట్టుబడితో 14,000 మందికి ఉపాధి కల్పించే రెండు అవగాహన ఒప్పందాలపై, ఆదిత్య బిర్లా గ్రూప్ రూ.9,300 కోట్ల పెట్టుబడితో 2 అవగాహన ఒప్పందాలపై సంతకం చేసింది. జిందాల్ స్టీల్ 2,500 మందికి ఉపాధి కల్పించే రూ.7,500 కోట్ల పెట్టుబడితో ఒక అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది.


రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొల్లపల్లి అశోక్, అధికారులు

సాగునీటి ఎద్దడిపై రైతుల ఆందోళన

- పిడబ్ల్యుడి కార్యాలయానికి తాళాలు

ప్రజాశక్తి - యానాం

కేంద్ర పాలిత ప్రాంతమైన యానాం పరిధిలోని దరియాలతిప్ప ఆయకట్టుకు సాగునీరందడంలేదని శుక్రవారం పిడబ్ల్యుడి కార్యాలయాన్ని రైతులు ముట్టడించి తాళం వేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ధర్నా వద్దకు వచ్చి రైతులతో మాట్లాడి సమస్యను తెలుసుకున్నారు. ఇంజనీర్లు నాగరాజు, హుస్సేన్, భాస్కర్ తదితరులతో మాట్లాడారు. ఆర్ఎఒ మునిస్వామి కూడా రైతుల వద్దకు వచ్చి సమస్యను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్ మాట్లాడుతూ సరిహద్దు ప్రాంతమైన తాళ్లరేవు మండల రైతాంగానికి వంతుల వారీగా సాగు నీరు ఇచ్చే విధంగా, యానాం రైతులకు కూడా సాగునీరు అందించి సహకరించాలని కోరారు. అనంతరం పిడబ్ల్యుడి కార్యాలయంలో తక్షణ కార్యాచరణపై ఎమ్మెల్యే అశోక్ ఆధ్వర్యాన అధికార యంత్రాంగం సమీక్షించింది. ఎమ్మెల్యే హామీ మేరకు రైతులు ఆందోళన విరమించారు. ధర్నాలో రైతులు సబ్బతి లోకేశ్వరరావు, సబ్బతి శ్రీనివాస్, నాగేశ్వరరావు, మాగాపు సుబ్బారావు, మల్లాడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ధరాభారంతో చితికిపోతున్న పేదలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పేదవారే కాదు మధ్యతరగతి ప్రజలూ పెరిగిన ధరలతో కుదేలవుతున్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలతోపాటు ఇంటి అద్దెలు, విద్యుత్ ఛార్జీలు, సొంతింటి కలిగిన వారికి ఆస్తి పన్నులు, విద్య, వైద్యంలో పెరిగిన ఖర్చులు, కూరగాయలు, పాలు ఇతర నిత్యావసర ధరలతో అన్ని తరగతుల ప్రజలూ విలవిల్లాడుతున్నారు. పెరుగుతున్న ఖర్చులకు అనుగుణంగా ఆదాయాలు లేకపోవడంతో కుటుంబ పోషణ కోసమే ఇబ్బందులు పడుతున్న పరిస్థితులు ఏర్పడ్డాయి.

ఉల్లిపాయలు కిలో రూ.30, టమోటా రూ.40, మిర్చి రూ.60, బెండకాయలు రూ.60 ఇలా అన్ని రకాల కూరగాయల ధరలు ఎక్కువగానే ఉన్నాయి. ఐదుగురు కుటుంబ సభ్యులున్న ఇంటికి రోజుకు కేవలం కూరగాయలకే రూ.100లకు పైగా ఖర్చవుతోంది. వీటితో పాటు వంటనూనె లీటరు రూ.170 నుంచి రూ.190 వరకూ పెరిగింది. మేలు రకం బియ్యం కిలో రూ.50 నుంచి రూ.60 వరకూ ఉంటుంది. కందిపప్పు, మినపప్పు, పెసర పప్పులదీ అదే దారే. కీలకమైన వంటగ్యాస్ ధరను ప్రజలు భరించలేనంతగా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం పెంచుకుంటూపోతోంది. ప్రస్తుతం గ్యాస్ రీఫిల్ సిలిండర్ ధర రూ.1152 అయ్యింది. డెలివరీ బాయ్ ఖర్చుతో కలుపుకుంటే రూ.1200 అవుతుంది. పెట్రోల్, డీజిల్ ధరలు రూ.112, రూ.100 నుంచి ఏమాత్రం దిగువకు రాని పరిస్థితి ఉంది. అలాగే ఆస్పత్రికి వెళ్లాల్సి వచ్చినప్పుడు ప్రిస్కిప్షన్ ప్రకారం మందులు కొనుగోలు చేయాలంటే గుండె ఆగినంత పనవుతోంది. షుగర్, బిపిలకు సంబంధించిన మందుల ధరలు ఇటీవల కాలంలో రెట్టింపయ్యాయి. యాంటి బయాటిక్స్ మందుల ధరలు కూడా బాగానే పెంచేశారు.

విద్యుత్ ఛార్జీలను ఒక పద్ధతి లేకుండా పెంచేస్తున్నారు. కస్టమర్, ఫిక్సడ్, ఓవర్‌లోడ్, ట్రూ అప్ ఛార్జీల పేరుతో రెండు నెలలకోసారి ఏదో ఒక రూపంలో భారీగా వసూలు చేస్తున్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెరగకపోవడంతో చిరు ఉద్యోగులు జీవించడానికే నానా అవస్థలు పడుతున్నారు. ప్రైవేటు రంగంలో పనిచేసే ఉద్యోగులే కాదు ప్రభుత్వంలో పనిచేసే చిరుద్యోగుల జీవన ప్రమాణాలు ఇటీవల కాలంలో దారుణంగా తయారయ్యాయి. ప్రతినెలా కుటుంబ పోషణ కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి ఉండటంతో ఇటీవల ప్రభుత్వ రంగంలో పనిచేసే ఉద్యోగులు కూడా ఆత్మహత్యలకు పాల్పడుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. ప్రభుత్వం ధరల నియంత్రణపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యుత్ భారం మోపడం అన్యాయం

- మాజీ మంత్రి కళావెంకట్రావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ వినియోగదారులపై భారాన్ని మోపడం అన్యాయమని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, విద్యుత్‌శాఖ మాజీ మంత్రి కళావెంకట్రావు విమర్శించారు. జగన్ లూటీ, అవినీతి కారణంగా వినియోగదారులపై రూ.55,273 కోట్ల భారాలు పడ్డాయని శుక్రవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. విద్యుత్ ప్రాజెక్టుల పేరుతో వేలాది కోట్లు కాంట్రాక్టులను బినామీలకు, అస్మదీయులకు కట్టబెడుతూ సొంత లాభం చూసుకుంటున్నారని విమర్శించారు. 2021-22 ఆర్థిక సంవత్సరంలో డిస్కమ్‌లు కొనుగోలు చేసిన విద్యుత్ కొనుగోళ్ల సర్దుబాటును 2023-24లో వసూలు చేసుకునేందుకు ఎపిఇఆర్‌సి డిస్కమ్‌లకు అనుమతివ్వడం దుర్మార్గమని పేర్కొన్నారు. ఇప్పటికే ఏడుసార్లు విద్యుత్ ఛార్జీలు పెంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

సోము వీర్రాజుపై విచారణ జరపాలి

- ఎస్‌సి కమిషన్ చైర్మన్‌కు దళిత సంఘాల విజ్ఞప్తి

ప్రజాశక్తి -అమరావతి బ్యూరో

చినకాకానిలో దళితుడు గొల్ల వరప్రసాద్‌కు చెందిన భూమిని దౌర్జన్యంగా ఆక్రమించుకుని హత్యాప్రయత్నం చేసిన బిజెపి రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజుపై విచారణ జరిపి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని దళిత సంఘాలు కోరాయి. ఈ మేరకు శుక్రవారం ఎస్‌సి కమిషన్ ఛైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్‌ను కెవిపిఎస్ నాయకులు అండ్ర మాల్యాద్రి, సమతా సైనిక్‌దళ్ నాయకులు మహేశ్వరరావు, సురేంద్రబాబు, రైల్వే ఎస్‌సి, ఎస్‌టి అసోసియేషన్ నాయకులు పాపారావు, నాయకులు నీలాంబరం, రాజేష్, శ్యామ్, శ్వేత తదితరులు కలిసి వినతిపత్రం సమర్పించారు. దీనిపై స్పందించిన విక్టర్ ప్రసాద్.. గుంటూరు ఎస్‌పి, మంగళగిరి డిఎస్‌పితో మాట్లాడి వెంటనే కేసు నమోదు చేసి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

వృద్ధురాలిపై అత్యాచారం

ప్రజాశక్తి-చీరాల (బాపట్ల జిల్లా)

గంజాయి మత్తులో వృద్ధురాలిపై ఓ కామాంధుడు అత్యాచారం చేశాడు. ఈ సంఘటన బాపట్ల జిల్లా చీరాల మండలం మరియమ్మపేటలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. చీరాల పట్టణంలోని మరియమ్మపేటలో ఒంటరిగా ఉంటున్న ఓ వృద్ధురాలిపై అదే ప్రాంతానికి చెందిన దేవర వెంకటేష్ అలియాస్ బండ అనే యువకుడు గంజాయి మత్తులో గురువారం అర్ధరాత్రి అత్యాచారం చేశాడు. ఆమె పెద్దగా అరవడంతో స్థానికులు వెంకటేష్‌ను పట్టుకొనే ప్రయత్నం చేశారు. కానీ నిందితుడు అక్కడి నుండి పరారయ్యాడు. వృద్ధురాలికి చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స అందిస్తున్నారు. గతంలో కూడా ఓ మహిళపై అత్యాచారానికి యత్నించగా స్థానికులు దేహశుద్ధి చేశారు. శుక్రవారం మధ్యాహ్నం నిందితుడిని స్థానికులే పట్టుకొని పోలీసులకు అప్పగించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉక్కు పరిరక్షణ నేతలపై నిర్బంధం

- 32 మంది అరెస్టు
- కేంద్ర మంత్రి గడ్కరీ పర్యటన నేపథ్యంలో ప్రభుత్వ దుశ్చర్య



కూర్మన్నపాలెం కూడలిలో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నేతలు

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నేతలపై ప్రభుత్వం మరోసారి నిర్బంధాన్ని ప్రయోగించింది. నిర్బంధానికి వెరవక కార్మికులు పోరాట స్ఫూర్తిని ప్రదర్శించారు. స్టీల్‌ప్లాంట్ సమీపంలో ఉన్న మెడ్‌టెక్ జోన్‌ను కేంద్ర ఉపరితల రవాణా, పోర్టుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ సందర్శించనున్న నేపథ్యంలో స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నేతలు కూర్మన్నపాలెం కూడలిలో శుక్రవారం పెద్ద ఎత్తున నిరసనకు దిగారు. జాతీయ రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. పోలీసులు పెద్ద సంఖ్యలో వచ్చి రాస్తారోకో, నిరసనలకు అనుమతులు లేవంటూ అక్రమ అరెస్టులకు తెగబడ్డారు. దొరికిన వారిని దొరికినట్టు వ్యాన్‌లోకి ఎక్కించేశారు. 32 మందిని అరెస్టు చేసి ఎయిర్‌పోర్టు, పెందుర్తి పోలీస్ స్టేషన్లకు తరలించారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, పోరాట కమిటీ చైర్మన్లు డి.ఆదినారాయణ, ఎం. రాజశేఖర్, నాయకులు వరసాల శ్రీనివాసరావు. రామస్వామి, బొడ్డు పైడిరాజు, కె.పరంధామయ్య, కె.వెంకటరావు, డి.శ్రీనివాస్, పల్లా పెంటారావు, కారు రమణ, కెఎస్‌ఎన్.రావు, వైటి.దాస్, సుబ్బయ్య, శ్రీనివాసరాజు, ఎల్‌ఐజి.రావు, తాటికొండ జగదీష్ తదితరులు ఉన్నారు. అనంతరం అరెస్టయిన నేతలను విడుదల చేశారు. అక్రమ అరెస్టులను సిపిఎం, పలు ప్రజా సంఘాలు ఖండించాయి. నిరసనలను పసిగట్టిన అధికారులు రోడ్డు మార్గాన కాకుండా హెలికాప్టర్ ద్వారా గడ్కరీ ప్రయాణాన్ని మార్చారు.

స్థానిక ఎమ్మెల్యేపై కార్మికుల మండిపాటు

స్టేషన్‌లో ఉన్న నాయకులను గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పరామర్శించారు. 'కార్మిక సంఘాల నేతలను పోలీసులతో అరెస్టు చేయించి, ఇప్పుడు పరామర్శలేంటి' అంటూ పలువురు కార్మికులు ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఆయన పరామర్శకు వచ్చారని కొందరు విమర్శించారు. కేంద్ర చర్యలకు వ్యతిరేకంగా పోరాడి విశాఖ ఉక్కుపై ఉన్న చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని అన్నారు.

ఉక్కు పరిరక్షణ పోరాటాన్ని కొనసాగిస్తాం

అక్రమ అరెస్టులనుద్దేశించి సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ.. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ నిర్ణయాన్ని కేంద్రం ఉపసంహరించుకునేంత వరకూ పోరాటాన్ని కొనసాగిస్తామన్నారు. అదానీ, అంబానీ వంటి బడా కార్పొరేట్ శక్తులకు విశాఖ ఉక్కును కట్టబెట్టాలని చూస్తోన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని దేశవ్యాప్తంగా ఎవరూ సమర్థించడం లేదన్నారు. ఉక్కు ప్రయివేటీకరణపై మోడీ సర్కారు ముందుకెళ్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు.

కెవిఎస్ పాఠశాల అభివృద్ధికి కృషి

- ట్రస్ట్ కార్యదర్శి పి.మధు
- సాంస్కృతిక వేదిక నిర్మాణం, ఆటస్థలం అభివృద్ధికి శంకుస్థాపన

ప్రజాశక్తి - దుగ్గిరాల (గుంటూరు జిల్లా)



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న చలువాది మల్లికార్జునరావు తదితరులు

పేద పిల్లలకు శతాబ్ద కాలంగా విద్యనందిస్తోన్న కెవిఎస్ (కాట్రగడ్డ వెంకట సుబ్బయ్య) హైస్కూల్ అభివృద్ధికి మరింత కృషి చేస్తున్నామని పాఠశాల ట్రస్ట్ కార్యదర్శి, రాజ్యసభ మాజీ సభ్యులు పి.మధు అన్నారు. గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం చిలువూరులోని పాఠశాలలో సాంస్కృతిక వేదిక నిర్మాణం, ఆట స్థలం అభివృద్ధి పనులకు పొట్టి శ్రీరాములు ఇంజినీరింగ్ కాలేజీ కమిటీ అధ్యక్షులు చలువాది మల్లికార్జున రావు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ కాట్రగడ్డ వెంకట సుబ్బయ్య, మాణిక్యమ్మ భూరి విరాళంతో వందేళ్ల కిందట ఏర్పాటైన పాఠశాలలో తొలి నుండి పేదలకు నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. కరోనా కారణంగా కొద్దికాలం మూసేసినా మళ్లీ ప్రారంభిచామని చెప్పారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయులను నియమించి ఎల్‌కెజి, యుకెజికి ఉచిత విద్యనందిస్తామని, పాలిటెక్నిక్, బిఇడి కోర్సులనూ ప్రారంభిస్తున్నామని తెలిపారు. పాఠశాలను మరింత అభివృద్ధి చేయడం కోసం పాఠశాలను ట్రస్టీకి అందించిన దాత కాట్రగడ్డ నారాయణ అధ్యక్షతన చిలువూరు, తుమ్మపూడి గ్రామస్తులను కలుపుకొని స్కూల్ కమిటీని ఏర్పాటు చేశామని వివరించారు. చలువాది మల్లికార్జునరావు మాట్లాడుతూ నాణ్యమైన విద్య కరువైన రోజుల్లో ఇలాంటి విద్యాసంస్థ అవసరమని, దీన్ని మరింత అభివృద్ధి చేయడానికి స్థానిక పెద్దల సహకారం తీసుకోవాలని సూచించారు. పాఠశాల ట్రస్ట్ చైర్మన్ కాట్రగడ్డ నారాయణ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి ఇక్కడ చదివి ఉన్నత స్థాయికి ఎదిగిన వారు, ఎన్‌ఆర్‌ఐలు తమవంతు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల నిర్వహణ బాధ్యులు పి.మురళీకృష్ణ, నిర్మలా విద్యా సంస్థలకు చెందిన వివి ప్రసాద్, పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు ఎన్.భావనారాయణ, డాక్టర్ కెవిఎస్ సాయి ప్రసాద్, జి.రమేష్, పి.వనజ కుమారి, సర్పంచ్ చిలువూరి మాణిక్యం, ఎంపిటిసి మరియా రోజమ్మ, మాజీ జడ్‌పిటిసి సభ్యులు ఎడ్ల వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి-అద్దంకి (బాపట్ల జిల్లా)

అప్పుల బాధ భరించలేక లారీ కిందపడి రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన బాపట్ల జిల్లా అద్దంకి మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. మృతుని కుటుంబసభ్యులు, పోలీసుల వివరాల మేరకు..శంఖవరప్పాడు గ్రామానికి చెందిన సోము పిచ్చిరెడ్డి(36) మూడు ఎకరాల సొంత పొలంతో పాటు మరికొంత భూమిని కౌలుకు తీసుకుని పత్తి, వరి, మిర్చి పంటలు సాగు చేసేవారు. ఇందుకోసం సుమారు రూ.11 లక్షలు అప్పు చేశారు. గత ఐదు సంవత్సరాలుగా పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో అప్పులకు వడ్డీల భారమై ఆత్మహత్య చేసుకున్నాడు.

కోర్టు ఉత్తర్వులు అమలు చేయాల్సిందే..

- అసైన్డ్, సీలింగ్ భూములను పంచాలని దళితుల ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు



ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న పేద దళితులు

భూస్వాముల స్వాధీనంలో ఉన్న అసైన్డ్‌మెంట్, సీలింగ్ భూములను కోర్టు ఉత్తర్వుల మేరకు తమకు పంచాలని డిమాండ్ చేస్తూ ఏలూరు జిల్లా కలెక్టరేట్ వద్ద దోసపాడు దళితులు శుక్రవారం ధర్నా చేశారు. ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన జరిగిన ధర్నాలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ దెందులూరు మండలం దోసపాడు పేద దళితులకు 1956 నుండి దఫదఫాలుగా అసైన్డ్, సీలింగ్ భూములను ప్రభుత్వం పంపిణీ చేసిందన్నారు. ఆ భూములను విజయవాడకు చెందిన దేవినేని బాజీప్రసాద్ తదితరులు బలవంతంగా ఆక్రమించి చట్టవిరుద్ధంగా చేపలు, రొయ్యల చెరువులుగా మార్చుకున్నారని తెలిపారు. 25 ఏళ్లుగా భూములు ఆక్రమణకు గురైనా పోలీసులు, రెవెన్యూ అధికారులు స్పందించక పోవడం దారుణమన్నారు. పైగా భూముల కోసం పోరాటం చేస్తున్న 12 మంది దళిత యువకులపై అక్రమ కేసులు బనాయించి అరెస్టు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలు తమ భూములను తమకు ఇప్పించాలని అన్ని కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితంలేకపోవడంతో లోకాయుక్తలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అసైన్డ్, సీలింగ్ భూములను పేద దళితులకు అప్పగించాలని 2015 జులై 24న లోకాయుక్త న్యాయమూర్తి రెవెన్యూ అధికారులను ఆదేశించారని అన్నారు. ఈ ఆదేశాల అమలులో రెవెన్యూ అధికారులు తాత్సారం చేస్తుండడంతో జిల్లా కోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు.

లోకాయుక్త ఆదేశాలను యథావిధిగా అమలు చేయాలంటూ జిల్లా కోర్టు న్యాయమూర్తి ఆదేశాలు ఇచ్చారని అన్నారు. దళితులకు స్టేటస్కో ఆర్డర్ ఇచ్చినట్లు తెలిపారు. కోర్టు ఉత్తర్వుల మేరకు అసైన్డ్ భూములను స్వాధీనం చేసుకుని పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్దఎత్తున పోరాటానికి సన్నద్ధమవుతామని హెచ్చరించారు. పేదల భూములు ఆక్రమించుకున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నాలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు అంతగాని ఆనందరావు, చల్లా లాజర్ మణి, భూపోరాట నాయకులు డి.నాగేంద్ర, పి.సునీల్, పి.వెంకటరమణ, దేవకృప, శిరీష, ఏసుమణి, కుమారి, లలిత, చిట్టిబాబు, నాని, దివాకర్ పాల్గొన్నారు.

అప్పులపై ఆరా!

- కేంద్రం వివరాల సేకరణ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్రం చేసిన అప్పులపై కేంద్రం వివరాలు సేకరిస్తోంది. రాజ్యసభలో దీనిపై ప్రశ్న రావడంతో కేంద్ర ఆర్థికశాఖ ఆ వివరాలు సేకరించే పనిలో పడింది. ఈ మేరకు రాష్ట్రానికి పలు ప్రశ్నలతో కూడిన లేఖ పంపించింది. రాష్ట్ర విభజన జరిగిన 2014 నుంచి వివరాలు చెప్పాలంటూ రాజ్యసభలో ఒక ప్రశ్న ఖరారు కావడంతో అందుకు సంబంధించిన వివరాలు సమర్పించాలని రాజ్యసభ నుంచి కేంద్రానికి లేఖ వెళ్లడం, అవే వివరాలపై కేంద్రం నుంచి రాష్ట్ర ఆర్థికశాఖకు సర్క్యులర్ వచ్చింది. 2014 జూన్ మూడో తేదీ నుంచి గతేడాది అక్టోబరు వరకు చేసిన అప్పుల వివరాలు సమర్పించాలని కేంద్ర ఆర్థికశాఖ కోరింది. సంవత్సరాల వారీ లెక్కలు ఇవ్వాలని స్పష్టం చేసింది. ఈ మొత్తం అప్పుల్లో ప్రభుత్వ రంగ సంస్థలు, కార్పొరేషన్ల ద్వారా తీసుకున్న రుణాల వివరాలు కూడా ఇవ్వాలని పేర్కొంది. పలు సంస్థలు, ప్రభుత్వం నేరుగా బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాల వివరాలు బ్యాంకుల వారీ సమర్పించాలని స్పష్టం చేసింది. నాబార్డు వంటి వాటి రుణాలు కూడా చెప్పాలని లేఖలో పేర్కొంది.

2014 నుంచి 2019 వరకు, 2019 నుంచి ఇప్పటివరకు ప్రభుత్వాలు తీసుకుంటున్న రుణాలపై భిన్న వాదనలు వినిపిస్తున్న నేపథ్యంలో రాజ్యసభలో జరిగే చర్చ కీలకం కానుంది. టిడిపి, వైసిపి మధ్య ఈ వివాదం చాలా కాలంగా నడుస్తూనే ఉంది. సంవత్సరం, బ్యాంకు, కార్పొరేషన్, ప్రభుత్వ రంగ సంస్థల వారీ వివరాలు కోరడంతో రాష్ట్ర ఆర్థికశాఖ అధికారులు కూడా వివరాల కోసం కుస్తీ పడుతున్నారు. ఇప్పటివరకు కార్పొరేషన్ల ద్వారా తీసుకున్న వివరాలను అధికారులు బయటపెట్టకపోవడం తెలిసిందే. కేంద్రం, కాగ్, రిజర్వు బ్యాంకు వంటి సంస్థలు కార్పొరేషన్ రుణాలపై పదేపదే రాష్ట్ర ఆర్థికశాఖకు లేఖలు రాస్తున్నాయి. ఈ తరుణంలో రాజ్యసభలో రానున్న ప్రశ్నకోసం కేంద్రానికి రాష్ట్ర అధికారులు ఎలాంటి వివరాలు అందిస్తారన్నది వేచి చూడాలి.

22 'ఎ' సమస్య పరిష్కరిస్తాం

టిటిడి ఇఒ ఎవి ధర్మారెడ్డి

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో

తిరుపతిలో 22 'ఎ' సమస్య పరిష్కరిస్తామని టిటిడి ఇఒ ఎవి.ధర్మారెడ్డి హామీ ఇచ్చారు. తాము పేర్కొన్న సర్వే నెంబర్లలోని మొత్తం భూములను రిజిస్ట్రేషన్ చేయరాదని ప్రభుత్వానికి పంపిన లేఖను తాత్కాలికంగా నిలిపివేయాలని మరో లేఖ రాసినట్లు తెలిపారు. టిటిడి భూములను సబ్ డివిజన్ చేసి వాటి రిజిస్ట్రేషన్లు మాత్రమే నిలిపివేయించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో 'డయల్ యువర్ ఇఒ' కార్యక్రమం అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. టిటిడికి చెందిన కొన్ని సర్వే నెంబర్లలోని విస్తీర్ణం, సబ్ డివిజన్ల డూప్లికేషన్లను సరిచేసి మరో జాబితాను ఎండోమెంట్ కమిషనర్ ద్వారా రిజిస్ట్రేషన్ శాఖకు పంపిస్తామని చెప్పారు. తిరుపతి జిల్లా తిరుపతి మండలం, తిరుపతి డివిజన్‌లో వివిధ సర్వే నంబర్లలో చాలా వరకు విస్తీర్ణాలు డూప్లికేషన్ అయ్యాయని, ఐజిఆర్‌ఎస్ వెబ్‌సైట్‌లో పొరపాట్లు సరిదిద్ది ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూస్తామని తెలిపారు.

బుల్ రంకె..

సెన్సెక్స్ 900 పాయింట్ల ర్యాలీ • దుమ్మురేపిన పిఎస్‌బి షేర్లు

ముంబయి : గత కొన్ని సెషన్లలో ఒత్తిడిని ఎదుర్కొన్న దేశీయ స్టాక్ మార్కెట్లు వారాంతం రోజున ఒక్క సారిగా రివ్వున ఎగిశాయి. కొనుగోళ్ల మద్దతుతో శుక్రవారం సెషన్‌లో భారీ లాభాలను సాధించాయి. ముఖ్యంగా ప్రభుత్వ రంగ బ్యాంక్‌లు, అదాని స్టాక్స్ మద్దతుతో బిఎస్‌ఇ సెన్సెక్స్ 900 పాయింట్లు రాణించి 59,809కి చేరింది. ఇదే బాటలో ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ 272 పాయింట్లు పెరిగి 17,594 వద్ద ముగిసింది. అదాని ఎంటర్‌ప్రైజెస్ షేర్ 17 శాతం పెరిగి రూ.1,879కి చేరింది. అదాని ఇతర స్టాక్స్‌కు కొనుగోళ్ల మద్దతు లభించింది. మరోవైపు ప్రభుత్వ రంగ బ్యాంక్‌ల సూచీలకు డిమాండ్ పెరిగింది. నిఫ్టీలో పిఎస్‌యు బ్యాంక్ ఇండెక్స్ 5.4 శాతం పెరిగింది. యూకో బ్యాంక్, యూనియన్ బ్యాంక్ స్టాక్స్ ఏకంగా 8 శాతం చొప్పున లాభపడ్డాయి. బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, పంజాబ్ అండ్ సింద్ బ్యాంక్, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ బ్యాంక్ షేర్లు 6 శాతం పైగా పెరిగాయి. ఎస్‌బిఐ, కెనరా బ్యాంక్‌లు 5 శాతం చొప్పున ర్యాలీ చేశాయి. లోహ సూచీ 3.5 శాతం, ఎఫ్‌ఎంసిజి, రియాల్టీ సూచీలు ఒక్క శాతం చొప్పున పెరిగాయి. అంతర్జాతీయ మార్కెట్లలోని సానుకూల పవనాలు దేశీయ స్టాక్స్‌కు మద్దతుగా నిలిచాయి. ఫిబ్రవరిలో సేవల రంగం కార్యకలాపాలు 12 ఏళ్ల గరిష్టానికి చేరాయనే రిపోర్టులు ఇన్వెస్టర్లలో విశ్వాసాన్ని పెంచాయి.

అమెజాన్ పేపై ఆర్‌బిఐ జరిమానా

ముంబయి : ఇ-కామర్స్ సంస్థ అమెజాన్‌కు చెందిన అమెజాన్ పేకు రిజర్వ్ బ్యాంక్ ఊహించని షాక్ ఇచ్చింది. పలు నిబంధనలు పాటించని ఆ సంస్థకు ఆర్‌బిఐ రూ.3.06 కోట్ల జరిమానా విధించింది. అమెజాన్ పే (ఇండియా) ప్రీ పెయిడ్ పేమెంట్ ఇన్‌స్ట్రుమెంట్స్ (పిపిఐలు), నో యువర్ కస్టమర్ (కెవైసి)లకు సంబంధించిన కొన్ని నిబంధనలను పాటించలేని ఆర్‌బిఐ తెలిపింది.

మదనపల్లిని జిల్లా చేస్తాం

- 'యువగళం' పాదయాత్రలో నారా లోకేష్ హామీ

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

టిడిపి అధికారంలోకి వస్తే పుంగనూరు, పీలేరు, తంబళ్లపల్లి, మదనపల్లి నియోజకవర్గాలను కలిపి మదనపల్లి జిల్లాగా ఏర్పాటు చేస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ హామీ ఇచ్చారు. 'యువగళం' పేరుతో లోకేష్ చేపట్టిన పాదయాత్ర శుక్రవారం పుంగనూరు నియోజకవర్గం పులిచెర్ల మండలం కొమ్మిరెడ్డిపల్లి విడిది కేంద్రం నుంచి ప్రారంభమయ్యింది. కొత్తపేట బహిరంగసభలో లోకేష్ ప్రసంగించారు. అప్పర్ తుంగభద్రపై కర్ణాటకలో ప్రాజెక్టు కడితే భవిష్యత్‌లో రాయలసీమ ఎడారిగా మారిపోతుందన్నారు. అయినా వైసిపి ఎంపిలు ఒక్కరూ నోరు మెదపడం లేదని విమర్శించారు. పుంగనూరులో పి3 ఫార్ములా అమలవుతోందని, పుంగనూరు- పెద్దిరెడ్డి- పాపాలు అని పేర్కొన్నారు. పెద్దిరెడ్డిని ఎవరైనా 'పెద్దాయనా' అని పిలవాలని చెబుతున్నారని భూములు దోచినందుకా? ఇసుక తిన్నందుకా? మట్టి మాఫియాను ప్రోత్సహించినందుకా? గంజాయిని సరఫరా చేస్తున్నందుకా? అని ప్రశ్నించారు. కాంట్రాక్టులను ఎవరూ తీసుకోవడం లేదని, గతంలో ఒక వైసిపి నాయకుడు తీసుకుని, బిల్లులు రాక ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. రాష్ట్రమంతా అమూల్ కంపెనీలను పెట్టిన సిఎం జగన్మోహన్‌రెడ్డి పుంగనూరులో ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. 300 ఎకరాల ఫారెస్టు భూమిని పెద్దిరెడ్డి దోచేశారని ఆరోపించారు. తన పాదయాత్రలో 33 కిలోమీటర్లకు ఒక కేసు పెడుతున్నారని, అయినా తగ్గేదేలే అని అన్నారు. పుంగనూరు పెద్దిరెడ్డిని, తాడేపల్లి పిల్లిని శాశ్వతంగా ఇంటికి పరిమితం చేయాలని కోరారు. యాత్ర ఎగువ బెస్తపల్లి, మంగళంపేట, బలిజల్లి మీదుగా కొక్కువారిపల్లి గ్రామానికి చేరుకుంది. శనివారం కొక్కువారిపల్లి నుంచి యాత్ర ప్రారంభం కానుంది. యాత్రలో మాజీ మంత్రి అమరనాథరెడ్డి, నాయకులు పులివర్తినాని, పయ్యావుల కేశవ్ పాల్గొన్నారు.

సంపాదకీయం

సముచిత తీర్పు

అధికారంలో ఉన్న శక్తులకు మోకరిల్లి గులాం గిరీ చేసే వ్యవస్థలా ఎన్నికల నిర్వహణా వ్యవస్థ ఉండరాదని, భారత ప్రధాన ఎన్నికల కమిషనర్, కమిషనర్ల నియామకాలు పారదర్శకంగా, ప్రజాస్వామ్యయుతంగా జరగాలంటూ సుప్రీంకోర్టు గురువారం ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమైనది. సముచితమైనది. ప్రజాస్వామ్యయుతంగా, స్వేచ్ఛాయుతంగా, పారదర్శకంగా ఎన్నికలు జరగాలంటే స్వతంత్ర ఎన్నికల వ్యవస్థ తప్పనిసరి అని జస్టిస్ కెఎం జోసెఫ్ నేతృత్వంలోని సర్వోన్నత న్యాయస్థాన రాజ్యాంగ ధర్మాసనం ఉద్ఘాటించింది. భారత రాజ్యాంగంలో అధికరణ 324 నుంచి 329 వరకు విశదీకరించిన ఎన్నికల వ్యవస్థ నిర్మాణాంశాల్లో భారత ఎన్నికల ప్రధాన కమిషనర్, కమిషనర్ల నియామకాల బాధ్యత రాష్ట్రపతికి దఖలు పర్చారు. స్వతంత్ర్యయుత నియామాకాల ప్రక్రియ కోసం అవసరమైతే పార్లమెంటు తగిన చట్టం రూపొందించాలని రాజ్యాంగ కర్తలు నిర్దేశించినా అది నేటికీ కార్యరూపం దాల్చలేదు. పార్లమెంటు అలాంటి ఒక చట్టం రూపొందించే వరకు.. భారత ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను, కమిషనర్లను ప్రధానమంత్రి, పార్లమెంటులో ప్రధాన ప్రతిపక్ష నేత లేదా అతిపెద్ద ప్రతిపక్ష పార్టీ నేత, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తితో కూడిన త్రిసభ్య కమిటీయే ఎంపిక చేయాలని సుప్రీంకోర్టు స్పష్టీకరించింది. ప్రస్తుతం అమల్లో ఉన్న ఎంపిక తీరును రద్దు చేయాలని కూడా నిర్దేశించింది. వాస్తవానికి సిబిఐ డైరెక్టర్, లోక్‌పాల్ రాజ్యాంగ సంస్థల నియామకాలకు సంబంధించి ఇలాంటి ఎంపిక పద్ధతి ఇప్పటికే అమలులో ఉంది. ఎన్నికల సంఘానికి కూడా ఆ పద్ధతిని ఇప్పుడు సుప్రీంకోర్టు అన్వయిస్తూ తీర్పు వెలువరించడం ముదావహం.

దేశంలో ఎన్నికల వ్యవస్థ నిష్పక్షపాత వైఖరిని, పాదర్శకతను పాటిస్తోందని, స్వతంత్రంగా నడుచుకుంటోందనే ప్రజలు నమ్ముతూవచ్చారు. కానీ ఇటీవలి కాలంలో ఆ నమ్మకం నీరుగారిపోతోంది. ఎన్నికల కమిషనర్ల నియామకం వివాదస్పదం కావడం, అకారణంగా ఎన్నికల షెడ్యూళ్లలో మార్పులు, చేర్పులు జరగడం, అవి పాలకులకు అనుగుణంగా ఉండటం, అధికార పార్టీకి అనుచిత లబ్ధి చేకూర్చే ఎన్నికల బాండ్లు ప్రవేశపెట్టడం..వంటి బిజెపి ప్రభుత్వంలో చోటుచేసుకున్న ఈ పరిణామాలన్నీ దేశ ఎన్నికల వ్యవస్థపైనే నీలి నీడలు కమ్ముకునేలా చేశాయి.

గతేడాది భారత ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా రాజీవ్ కుమార్ నియమితులైన తర్వాత ఖాళీ అయిన ఎన్నికల కమిషనర్ పదవికి అరుణ్ గోయల్‌ను ఎంపిక చేయడం, అందుకు సంబంధించిన దస్త్రాలు శరవేగంగా కదిలిన తీరు యావత్ భారతావనినే విస్మయానికి గురిచేసిన సంగతి తెలిసిందే. 2022 డిసెంబరు 31న పదవీ విరమణ చేయాల్సిన గోయల్ అదే ఏడాది నవంబరు 18న స్వచ్ఛంద పదవీ విరమణకు దరఖాస్తు చేసుకోవడం.. ఆ వెంటనే ఆయనను కేంద్ర ప్రభుత్వం ఎన్నికల కమిషనరుగా నియమించడం ఆఘమేఘాల మీద జరిగిపోయాయి. ఇంత మెరుపు వేగంతో చేసే నియామకాలు ఎవరి ప్రాపకం కోసమో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. అదే ఏడాది హిమాచల్ ప్రదేశ్, గుజరాత్ శాసనసభ ఎన్నికలు జరగాల్సివుండగా హిమాచల్‌ప్రదేశ్‌కు ముందుగా షెడ్యూలు ప్రకటించి...గుజరాత్‌కు జాప్యం చేయడంతో ఎన్నికల సంఘం విశ్వసనీయతపై భ్రమలు తొలగిపోయాయి. ఈ పరిణామాల నేపథ్యంలోనే ఎన్నికల వ్యవస్థ స్వతంత్రతపై సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వానికి చెంప పెట్టులాంటి తీర్పునివ్వడం న్యాయ వ్యవస్థ తన విశ్వసనీయతను పెంచుకుందని చెప్పవచ్చు.

ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువుగా ఉండే రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేసి వాటిని కీలుబొమ్మలుగా చేసుకుంటున్న ఉదంతాలు పెరిగిపోతున్న దశలో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు ఉపశమనమనే చెప్పాలి. సుప్రీంకోర్టు కొలిజీయం వ్యవస్థపైనా చర్చలు జరుగుతున్న ప్రస్తుత తరుణంలో ఏకపక్ష విధానాలు కాకుండా ప్రజాస్వామ్య భాగస్వామ్యాన్ని ఇనుమడింపజేసే విస్తృత ప్రాతిపదికనే సర్వామోద యోగ్యమైన పారదర్శకత, నిష్పక్షపాత నియామకాల ప్రక్రియ ప్రజాస్వామ్య వ్యవస్థలను బలోపేతం చేస్తాయనడంలో సందేహం లేదు.

మంచిమాట



"21 వ శతాబ్దంలో నిరక్షరాస్యుడు అంటే చదవడం, రాయడం రాని వాడు కాదు. గుణపాఠాలను నేర్చుకోవడానికి, తప్పులను సరిదిద్దుకోవడానికి, సరైన మార్గంలో పయనించడానికి సిద్ధపడని వాడు"

- అమెరికా రచయిత ఆల్విన్ టోఫ్లర్

ఓటు హక్కుతో ప్రైవేటు టీచర్లు సంఘటితం!

విశ్లేషణ



వి.బాలసుబ్రహ్మణ్యం

శాసనమండలి ఎన్నికలు ముంగిట్లోకి వచ్చేశాయి. అనూహ్యంగా ఈ సారి ప్రైవేటు ఉపాధ్యాయులు వీటిలో కీలక పాత్ర పోషించబోతున్నారు. ఎన్నికలు జరుగుతున్న రెండు ఉపాధ్యాయ నియోజక వర్గాల్లో దాదాపు 35శాతం ఓట్లు వీరివే కావడం మన రాష్ట్ర చరిత్రలో ఇదే మొదటిసారి. దీన్ని మనందరం ఆహ్వానించి తీరాలి.

అలహాబాద్ హైకోర్టు తీర్పు అరకొరగానే అమలు

అలహాబాద్ హైకోర్టు 2006లో ప్రైవేటు టీచర్లకు ఓటుహక్కు కల్పించాక, జివో.ఎం.ఎస్.537 తేదీ 2006 సెప్టెంబర్ 28న ఎన్నికల కమిషన్ దీనికనుగుణంగా ఉత్తర్వులివ్వడంతో ఈ కొత్త శకం మొదలైన బాలారిష్టాలు దాటడం అంత సులభంగా ఏమీ జరగలేదు. గుర్తింపు పొందిన హైస్కూళ్లో కనీసం 3ఏళ్ల సర్వీసు ఉండాలని, ఇపియఫ్ తప్పనిసరి అనీ, హెడ్‌మాస్టరు సంతకంపై సంబంధిత జిల్లా, ప్రాంతీయ అధికారి లేదా రిజిస్ట్రారు కౌంటరు సంతకం చెయ్యాలనీ ఎన్నికల కమిషన్ నిర్దేశించడంతో ఇప్పటికీ వీరి ఓటుహక్కు అరకొరగానే అమలవుతోంది.

అసలు సమస్య ఏ వివరాలూ లేకపోవడం

ప్రభుత్వం వద్ద ప్రైవేటు టీచర్ల ఖచ్చితమైన వివరాలు ఇంత సాంకేతిక విజ్ఞానం విస్తరించిన రోజుల్లో కూడా ఏవీ లేకపోవడం విద్యాశాఖ నిర్లక్ష్యానికి, చేతగానితనానికి గొప్ప నిదర్శనం ! దాదాపు 45 శాతం పాఠశాలల విద్యార్థులకు, 80 శాతం పైగా ఉన్నత, సాంకేతిక విద్యల విద్యార్థులకు విద్యనేర్పుతూ రాష్ట్ర విద్యారంగంలో ఒక గొప్ప పాత్ర పోషిస్తున్న ఈ టీచర్ల అధికారిక వివరాలు విద్యాశాఖ వద్ద లేకపోవడమేమిటి?

జ్ఞానభూమి, డైస్ లాంటి అధికార పోర్టల్స్‌లో వున్న ప్రైవేటు టీచర్ల వివరాలన్నీ తప్పుల తడకలు. వీటిలో నిజంగా పనిచేస్తున్న వారు సగం మంది కూడా వుండరు. అంతా యాజమాన్యాల దయాదాక్షిణ్యం. ఇక ఇపియఫ్ 10శాతం టీచర్లకు కూడా అమల్లో లేదు. ఈ మధ్య జీతం 15వేలు దాటితే ఇపియఫ్ అవసరం లేదన్న కుతర్కాన్ని ముందుకు తేవడం మరీ విచిత్రం. నిజానికి నిబంధన ఇపియస్ కాంట్రిబ్యూషన్‌కు సంబంధించింది. ఒకవేళ దీన్ని వర్తింపజేస్తే తమ బంధువుల కిద్దరికో, ముగ్గురికో చెల్లించి సరిపెడుతున్నారు. కొంతకాలం ఇంజనీరింగ్ కాలేజీలు ఈ విషయంలో మెరుగ్గా వుండేవి. ఇప్పుడవీ ప్రావిడెంటు ఫండుకు దూరంగా వుండిపొయ్యాయి. ఇక టీచర్లకు జీతాలు ఆన్‌లైన్‌లో చెల్లించరు. వీటికేమీ రికార్డులు వుండవు. చివరకు హాజరుపట్టికలో వుండే పేర్లకూ, పనిచేస్తున్న వారి పేర్లకూ, విద్యాశాఖ పోర్టల్స్‌లో వున్న పేర్లకూ ఏ పొంతనా వుండదు. ఈ తతంగమంతా విద్యాశాఖ కనుసన్నల్లోనే జరుగుతుండంతో పాపం ప్రైవేటు టీచర్లు ఏ అధికార రికార్డుల్లోలేని అనాథలుగా మిగులుతున్నారు. దీంతో వీరికి ఓటుహక్కు లభించడం అంతా యాజమాన్యాల కరుణా కటాక్షాల మీదా, విద్యాశాఖ అధికారుల్ని ప్రసన్నం చేసుకోవడం మీదా ఆధారపడి వుంటోంది.



> **వీరికెలాంటి పారదర్శక నియామక విధానం వుండదు. ఏడాదిలో 10 నెలలకు మించి జీతాలుండవు. అవీ అన్ని సబ్జెక్టుల వారికీ ఒకే రకంగా వుండవు. పాఠశాలల్లో పాతికవేలు, కళాశాలల్లో యాభైవేలు జీతం తీసుకొనే "మహర్జాతకులు" పదిశాతం కూడా వుండరు. ప్రభుత్వ కాంట్రాక్టు టీచర్లు వీరి కంటే వందరెట్లు నయం. కొన్ని సబ్జెక్టుల టీచర్లకు మూడు నెలలకు మించి పని వుండదు, తర్వాత పిల్లల కోసం ఇల్లిల్లూ తిరగడమే వీరి పని. ఎప్పుడైనా తీసెయ్యవచ్చు. ఏ సెలవులూ వుండవు. ఇక ప్రశ్నించడమనేది ఊహకయినా అందని విషయం. కరోనా కాలంలో భిక్షమెత్తుకున్న వారూ ఉన్నారంటే వీరిదెంత దయనీయ స్థితో మనం అర్థం చేసుకోవచ్చు.**

ఓటుహక్కు కూడా యాజమాన్యాల దాక్షిణ్యమేనా?

నిజానికి ఒక ప్రైవేటు టీచరు స్వయంగా ఓటరుగా నమోదయ్యే అవకాశం ఏ మాత్రమూ లేదు. దీనికి యజమాని సంతకం లభించదు. విద్యాశాఖాధికారి దగ్గరికి వెళ్లే శక్తి అతనికి ఉండదు. అందువల్ల యజమానులు కోరుకున్న వారే ఓటర్లవుతారు. వారే దరఖాస్తులు సేకరించి, తమ "శక్తియుక్తులతో" సంతకాలు చేయించి ఓటర్లుగా నమోదుచేస్తారు ! ఇందులో టీచర్ల ప్రమేయం ఏమీ వుండదు. దీనివల్ల నిజమైన టీచర్లు తీవ్రంగా నష్టపోతున్నారు. మౌన ప్రేక్షకులుగా మిగిలిపోవాల్సి వస్తోంది. ఖచ్చితమైన రికార్డులు సర్వీసుతో సహా వుండివుంటే, వాటిని అధికారికంగా వెబ్‌సైట్‌లో బహిరంగ పరచి వుంటే? వారంతా అర్హులైన ఓటర్లయివుండేవారు. ఒక హక్కుగా ఆ రికార్డుల్లోని టీచర్లందరూ ఓటర్లయ్యేవారు. ప్రభుత్వ టీచర్ల వివరాలు పక్కాగా వుండబట్టే నమోదు సమస్య వాళ్ళ చేతుల్ని దాటి పోవడం లేదు. ఓటరుగా నమోదు కావడం కూడా పరాధీనం కావడం ప్రైవేటు టీచర్ల విషయంలో పెద్ద విషాదం!

ఇక బోగస్ ఓటర్లు చేర్చడానికి కూడా ఈ రికార్డులు లేక పోవడమే కారణం. ఎన్నికల కమిషన్ కూడా ఉదారంగా ఏ రికార్డూ అవసరం లేదన్నట్టు, విద్యాశాఖాధికారి "సంతృప్తి" చెందితే చాలన్నట్టు, ఇపియఫ్ ఐచ్ఛికమంటూ సడలింపులు ఇచ్చాక అంతా అక్రమాల మయంగా మారింది. ఒకానొక స్కూల్లో 14 మంది టీచర్లు ఉంటే ఏకంగా 76 మంది ఓటర్ల జాబితాలోకి ఎక్కడం దీనికి పరాకాష్ట ! విద్యాశాఖాధికారులు అభ్యర్థుల చేతిలో కీలుబొమ్మలు, కాదంటే వారికి శంకరగిరి మాన్యాలు తప్పవు. అసలు వారి సంతకాలే లేకున్నా, ఫోర్జరీలు చేసినా మన ఎన్నికల కమిషన్ అన్నిటినీ చెల్లుబాటు చేస్తుంది ! ఫిర్యాదులు చేస్తే జిల్లా అధికారులు వాటిని బుట్టదాఖలు చేస్తారు. ప్రైవేటు టీచర్లకు ఎంతో గౌరవంతో న్యాయస్థానం కల్పించిన ఓటు హక్కును ఇలా బడా యజమానులు, రాజకీయపార్టీలూ కలిసి అపహాస్యం పాలు చేశాయి. మరీ విషాదమేమంటే ఈ ఫోర్జరీలు చేశారని ప్రైవేటు టీచర్లపై కేసులు నమోదు చెయ్యడం కూడా మొదలైంది. దీనికి తోడు ఓటరుగా నమోదయితే రేషన్‌కార్డు కూడా గల్లంతవుదన్న భయం కూడా జోడైంది! ఇలా ఓటు లభించడం అడుగడుగునా గండంగా మారింది.

ఇక ఓటు హక్కును అభ్యర్థే "ప్రసాదించాక", యజమానులే కథ అంతా నడిపిస్తున్నాక.. వారిని కాదని ప్రైవేటు టీచర్లు ఎలా స్వేచ్ఛగా ఓటెయ్యగలుగుతారు? అసలా పోలింగ్ రోజు ఏ సెలవూ ఇవ్వకపోతేనో, ఏ ఆంక్షల్లో పెడితేనో ఏమవుతుంది? అలహాబాద్ హైకోర్టు తీర్పు గంగార్పణం అవుతుంది!

బండచాకిరీ - నిలువుదోపిడి

నిజానికి ప్రైవేటు టీచర్లు నష్టజాతకుల్లోకెల్లా నష్ట జాతకులు. వీరికెలాంటి పారదర్శక నియామక విధానం వుండదు. ఏడాదిలో 10 నెలలకు మించి జీతాలుండవు. అవీ అన్ని సబ్జెక్టుల వారికీ ఒకే రకంగా వుండవు. పాఠశాలల్లో పాతికవేలు, కళాశాలల్లో యాభైవేలు జీతం తీసుకొనే "మహర్జాతకులు" పదిశాతం కూడా వుండరు. ప్రభుత్వ కాంట్రాక్టు టీచర్లు వీరి కంటే వందరెట్లు నయం. కొన్ని సబ్జెక్టుల టీచర్లకు మూడు నెలలకు మించి పని వుండదు, తర్వాత పిల్లల కోసం ఇల్లిల్లూ తిరగడమే వీరి పని. ఎప్పుడైనా తీసెయ్యవచ్చు. ఏ సెలవులూ వుండవు. ఇక ప్రశ్నించడమనేది ఊహకయినా అందని విషయం. కరోనా కాలంలో భిక్షమెత్తుకున్న వారూ ఉన్నారంటే వీరిదెంత దయనీయ స్థితో మనం అర్థం చేసుకోవచ్చు. దాదాపు 2 లక్షలకు పైగా వున్నా, వీరి శ్రమతో 7000-8000 కోట్ల 'వ్యాపారం' జరుగుతున్నా, ఉన్నత మధ్యతరగతి వర్గాలతోపాటు ప్రభుత్వ ఉపాధ్యాయులు సైతం తమ పిల్లలందరినీ వీరి వద్దనే చదివిస్తున్నా ఎవ్వరూ పట్టించుకోని వర్గమిది. ఈ మధ్య ప్రైవేట్ కార్పొరేట్ యజమానులు రాజకీయాల్నీ శాసించడం మొదలయ్యాక ఓటర్లను చేర్చడం నుంచి, వారికి తాయిలాలు పంచడం దాకా వీరి విధుల్లో సహజభాగమై పోయింది. అన్నిటికీ మించి వారికెలాంటి సంఘం లేకపోవడం, వీరు సంఘటిత పడే ఏ అవకాశం లేకపోవడమూ వీరిని మరీ ఒంటరి వాళ్లని చేస్తోంది.

ప్రైవేటు స్కూళ్ల ఫీజుల్లో 65 శాతం ఉపాధ్యాయుల జీతాలకు ఫియఫ్‌కు దక్కాలని జివో నెంబరు 1 చెపుతోంది. వీరి పేర్ల వివరాలు విద్యాశాఖకు ప్రతి సంవత్సరం అప్‌డేట్ చేసి అందించాలని నిబంధనలు చెపుతున్నాయి. ఇక ఇపియఫ్, ఇపియస్ అనేవి కార్మికులు పోరాడి సాధించుకొన్న హక్కులు. న్యాయంగా కార్మిక వర్గానికి వర్తించే హక్కులన్నీ చట్టం ప్రకారం వీరికీ వర్తించాలి. కానీ అన్నిటికీ వీరు మినహాయింపు కావడం ఆశ్చర్యమేస్తోంది.

పిడియఫ్ గొంతు తోడయ్యాక...

కానీ చరిత్ర ఎప్పుడూ ఒకేలా వుండదు. శాసనమండలిలో పిడియఫ్ ప్రవేశించాక వీరిని సంఘటిత పరచడానికి పలు ప్రయత్నాలు చేసింది. గుడివాడ, రాజమండ్రి, విజయవాడ, నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, కర్నూలు లాంటి జిల్లాల్లో ప్రైవేటు టీచర్ల సంఘాలు ఏర్పడ్డాయి. వీటన్నిటినీ ఒక తాటి మీదకి తెచ్చేందుకు విజయవాడలో పెద్ద సమావేశం నిర్వహించాం. సామాజిక మాధ్యమాలూ దీనికి బాగా తోడ్పడ్డాయి. ఈ దశలో శాసనమండలిలో ప్రైవేటు టీచర్ల సమస్యలపై పిడియఫ్ 2018 ఏప్రిల్ 4న జరిపిన చర్చ ఒక గొప్ప మలుపు. దీంతో ప్రభుత్వం పరిష్కరించాల్సిన కొన్ని ఉమ్మడి డిమాండ్లు చట్టసభల్లో సుదీర్ఘ చర్చకు నోచుకు న్నాయి.

మొదటి అంశం- వీరికి ఒక గుర్తింపు కావాలి. వీరందరి వివరాలు అధికారికంగా ఆయాశాఖలు గుర్తించి వెబ్‌సైట్‌లో వుంచాలి. ప్రతి ప్రైవేటు ఉపాధ్యాయుడికీ, ఉద్యోగికీ ఒక గుర్తింపు కార్డును ప్రభుత్వమే ఇవ్వాలి. రెండు- వీరిని సామాజిక భద్రతా చట్రంలోకి తీసుకురావాలి. వీరి కోసం ప్రభుత్వ, యాజమాన్యాల వాటాలతో ఒక సంక్షేమ నిధిని ఏర్పాటు చెయ్యాలి. కష్టకాలం వచ్చినపుడు వారి నిధి ఆదుకునేలా వుండాలి. మూడు-హెల్త్‌కార్డులివ్వాలి. దీని ప్రీమియాన్ని యాజమాన్యాలు చెల్లించాలి. నాలుగు- ఇపియఫ్ తప్పని సరిచేసి ఎంప్లాయిస్ పెన్షన్ స్కీముకు దీన్ని అనుసంధానించాలి. దీని వల్ల కొంత పెన్షన్ కూడా లభిస్తుంది. అయిదు- జివో.యం.యస్.1 అమలు చేసి 65 శాతం ఆదాయాన్ని వీరి వేతనాలకు కేటాయించాలి. ఆరు- కార్మిక హక్కులన్నీ వీరికి వర్తింపజెయ్యాలి.

రోజులు మారుతున్నాయ్

వీటిచుట్టూ మెల్లగానే అయినా, రాష్ట్ర స్థాయిలో కాకపోయినా గత కొంత కాలంగా ఎక్కడికక్కడ ప్రైవేటు టీచర్లు సంఘటిత పడసాగారు. స్థానిక సమస్యల్ని కూడా జోడించుకున్నారు. సామాజిక మాధ్యమాల్ని బాగా వాడుకోసాగారు. క్రమంగా వీరు ఏదొక మేరకు డిమాండ్ చేసే స్థితికి అక్కడక్కడా చేరుకున్నారు. మంచి టీచర్ల అవసరం కూడా పెరగడంతో వీరు గట్టిగా బేరసారాలు చేసే రోజులు కూడా వస్తున్నాయి. చీటికి మాటికి తీసెయ్యడం. వేధించడం కొంత మేరకయినా తగ్గుతోంది. కొన్ని మంచి యాజమాన్యాలు వీరికి తోడ్పాటునందించడం కూడా విశేషం. అయినా ఇదంతా తొలిదశలోనే వుందని మాత్రం మరిచిపోకూడదు.

ప్రైవేటు టీచర్లుగా చేరే వారు ఎక్కువ మంది డియస్సీ కోసం ఎదురు చూస్తుంటారు. తమ బోధనానుభవంతో మంచి ర్యాంకులు సాధిస్తారు కూడా. కానీ ప్రస్తుత ప్రభుత్వం వేలాది పోస్టుల్ని రద్దుచేసి, బడుల్ని విలీనం చేసి డియస్సీకి మంగళం పాడడం వీరి పాలిట అశనిపాతంగా మారింది.

చిన్న స్కూళ్లు సతమతం

దీనికి తోడు రాష్ట్రప్రభుత్వం యాజమాన్యాలపై వేధింపులకూ పూనుకుంది. ఫీజు రీయంబర్స్‌మెంట్‌కు కోతలు పెట్టింది. దాన్ని అమ్మల ఖాతోల్లో వేస్తోంది. గుర్తింపు రెన్యువల్ గడువును బాగా తగ్గించింది. ఫైర్ సర్టిఫికేట్ల కోసం లక్షలాది సొమ్ము ఖర్చు చెయ్యాల్సిన దుస్థితిని తెచ్చింది. కరోనాతో ప్రైవేటు విద్యాసంస్థలు చిన్న చిన్నవన్నీ నీరసపడిపొయ్యాయి. కార్పొరేట్ సంస్థలు మాత్రం కళ కళ లాడుతున్నాయి. ప్రైవేటు విద్య పట్ల, విద్యాసంస్థల మంజూరు పట్ల, వాటి సమస్య పట్ల ప్రభుత్వానికి కనీస బాధ్యత లేకపోడం బాధాకరం. ఇంతటి విస్తృత కీలక వ్యవస్థను మార్కెట్‌కు వదిలేసి ఏ రక్షణా కల్పించకుండా చోద్యం చూస్తుండటం సమస్యల్లోకెల్లా పెద్దసమస్య. ఫలితంగా వీటిలోని టీచర్లు కూడా వీధిన పడుతున్నారు.

కొత్త చరిత్రకు శ్రీకారం

ఇప్పుడు ప్రైవేటు టీచర్లను ఓటర్ల జాబితాలోకి యాజమాన్యాలు పోటా పోటీగా చేర్చాయి. మరి వీరి స్థితిగతులపై పెద్ద చర్చ ఇప్పుడైనా జరగాలి గదా ! కొన్ని డిమాండ్లు స్పష్టంగా ముందుకు రావాలి కదా ! అభ్యర్థులందరూ ఒకరికి మించిన హామీలు ఒకరు ఇవ్వాలి కదా! కానీ ఆ ధోరణి ఏమీ కన్పించడం లేదు. పాలక పార్టీనే ఈ ఎన్నికల్ని కబ్జా చేసి, నానా తప్పుడు చేష్టలకూ పాల్పడి, బడా యజమానుల్ని టీచర్ల ఎమ్మెల్సీలుగా పోటీపెట్టి "ఓ ప్రైవేటు టీచర్లలారా ! మీరంతా మా పల్లకీ మొయ్యండి ! మమ్ముల్ని అందలాలు లెక్కించండి" అంటోంది. ప్రలోభాలు పెడుతోంది. తాయిలాలు పంచుతోంది.మరి ఓటు హక్కుతోనైనా ప్రైవేటు టీచర్లు ఒకతాటిపైకి వస్తారా? ఇప్పుడైనా వీరి స్థితిగతులు బలంగా చర్చ కొస్తాయా? ఇన్నాళ్లూ వీరిని అణచి పెట్టిన వారే వీరి ఓట్లతో అందలా లెక్కాలా? వీరిని నడిపించగల, వీరి గొంతు విన్పించగల, వీరిని సంఘటితం చెయ్యగల సహజమిత్రుల్ని వీరు ఎన్నుకొంటారా?

ఈ ప్రశ్నలకు "మేమేమీ అమాయకులం కాదు"అనే సమాధానం ఈ ఎన్నికల్లో విన్పించే సూచనలు మొదటిసారిగా స్పష్టంగా కన్పిస్తున్నాయి. ఇది శుభ పరిణామం ! కొత్త చరిత్రకు శ్రీకారం !

(రచయిత శాసనమండలిలో పిడిఎఫ్ పక్ష నేత)

పాలస్తీనా ప్రజలకు అండగా నిలుద్దాం!

కామెంట్

PEOPLE'S DEMOCRACY

గతేడాది చివరిలో బెంజమిన్ నెతన్యాహు నేతృత్వంలో పచ్చి మితవాద, ఛాందసవాద, మతతత్వ పార్టీలతో కూడిన సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి వెస్ట్ బ్యాంక్‌లో పాలస్తీనియన్లపై ఇజ్రాయిల్ భద్రతా బలగాలు, యూదు సెటిలర్ల దాడులకు అడ్డు అదుపు లేకుండా పోతున్నది.

1967 యుద్ధం నాటి నుంచి వెస్ట్ బ్యాంక్‌ను ఇజ్రాయిల్ ఆక్రమిత ప్రాంతంగా పరిగణించే అంతర్జాతీయ చట్టాన్ని దారుణంగా ఉల్లంఘిస్తూ ఇజ్రాయిల్‌లో వెస్ట్ బ్యాంక్‌ను కలిపేసుకునే దిశగా చర్యలు తీసుకుంటామని నెతన్యాహు ప్రభుత్వం నిర్లజ్జగా ప్రకటించింది.

వెస్ట్ బ్యాంక్‌లో ఇంతకుముందు నిర్మాణాలు చేపట్టిన 9 అక్రమ సెటిలర్స్ కాలనీలను (సెటిల్మెంట్స్‌ను) క్రమబద్ధీకరిస్తున్నట్లు ఇజ్రాయిల్ ప్రభుత్వం ప్రకటించింది. ఒక్కో సెటిల్మెంట్‌లో 10వేల కొత్త ఇళ్ళు నిర్మించారు. అలాంటి 140 సెటిల్‌మెంట్లను ఇజ్రాయిల్ నిర్మించింది. 1967లో ఆక్రమించుకున్నప్పటి నుండి వెస్ట్ బ్యాంక్, తూర్పు జెరూసలేంలలో దాదాపు 6లక్షల మంది యూదు సెటిలర్లకు అక్రమంగా ఆవాసాలను ఏర్పాటుచేసింది. వెస్ట్ బ్యాంక్‌లో నివసిస్తున్న పాలస్తీనియన్లను వారి ఇళ్ళ నుండి, భూముల నుండి గెంటివేసేందుకు యూదు సెటిలర్ల అక్రమ ఆక్రమణలను ఇజ్రాయిల్ ప్రోత్సహిస్తూ పాలస్తీనీయులను తీవ్ర కడగండ్ల పాల్జేస్తోంది. కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత, ఆ సంకీర్ణ కూటమిలో భాగస్వాములుగా ఉన్న మతతత్వ పార్టీలు పాలస్తీనియన్ల తరలింపు, గెంటివేతలను బాహాటంగా సమర్థించుకొస్తున్నాయి. పాలస్తీనియన్లపై హింసాత్మక దాడులు ఈ కాలంలో విపరీతంగా పెరగడానికి ఇదొక ముఖ్య కారణం.

ఇజ్రాయిల్ రక్షణ బలగాలు, ఇతర పారా మిలటరీ బలగాలు వెస్ట్ బ్యాంక్‌లోని పాలస్తీనియన్ల ఇళ్ళపై పదేపదే దాడులకు తెగబడుతున్నాయి. తీవ్రవాదులను అరెస్టు చేస్తున్నామనే సాకుతో ఈ అకృత్యాలకు అవి పాల్పడుతున్నాయి. జనవరిలో జెనిన్‌లో పాలస్తీనీయులపై పెద్దయెత్తున దాడులకు దిగాయి. ఈ దాడుల్లో పది మంది అమాయక పాలస్తీనా పౌరులు మరణించారు.. మృతుల్లో 61ఏళ్ళ వృద్ధ మహిళ కూడా వున్నారు. నబ్లస్ పట్టణంలోనూ ఇదే విధమైన ఊచకోతకు పాల్పడ్డాయి. ఫిబ్రవరి 22న జరిగిన ఆ దాడిలో 11మంది పాలస్తీనియన్లు మరణించగా, మరో 102 మంది దాకా గాయపడ్డారు.

మొత్తమ్మీద కొత్త సంవత్సరం ప్రారంభంలోనే 62మంది పాలస్తీనియన్లు మరణించారు. అంటే సగటున రోజుకో పాలస్తీనియుడి కన్నా ఎక్కువమందే హతులవుతున్నారన్నమాట.

ఆ విధంగా పాలస్తీనీయులు తమ సొంత గడ్డపై శరణార్థులుగా బతుకీడ్చే దుస్థితికి నెట్టబడ్డారు. పాలస్తీనీయులను ఇజ్రాయిల్ ప్రభుత్వం వెంటాడి వేదిస్తోంది. పిల్లినైనా నాలుగు గోడల మధ్య బంధించి కొడితే తిరగబడుతుంది. అదే విధంగా పాలస్తీనియన్లు తమపై జరుగుతున్న ఈ అన్యాయాలు, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ఎదురు తిరగడం మొదలెట్టారు. నబ్లస్ దాడి తర్వాత, ఆ ప్రాంతానికి సమీపంలోని హువారాలో ఇద్దరు యూదు సోదరులను వారు కాల్చి చంపారు. అదేరోజు, 400మంది యూదు ఆవాసులు, ఐడిఎఫ్, ప్రభుత్వ బలగాలు కలసి మూకుమ్మడిగా దాడి చేశాయి. 30ఇళ్ళను తగలబెట్టాయి. మరో 40ఇళ్ళను, వంద కార్లను ధ్వంసం చేశాయి. ఈ దాడిలో ఒక పాలస్తీనా పౌరుడు చనిపోయాడు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. భద్రతా దళాలు విచక్షణా రహితంగా సాగించిన ఈ దాడులను పాలక సంకీర్ణానికి చెందిన సభ్యుడొకరు బాహాటంగా సమర్థించుకొచ్చారు. అంతేకాదు, ఈ హత్యాకాండకు పౌర హక్కుల గ్రూపులే కారణమని నిందించారు.

సరిగ్గా ఆ సమయంలోనే గాజా స్ట్రిప్‌లో నివసిస్తున్న పాలస్తీనియన్లపై ఇజ్రాయిల్ వైమానిక దాడులకు తెగబడింది. దీంతో ఆ ప్రాంతంలోని 20లక్షల మంది పాలస్తీనీయుల బతుకులు ఛిద్రమయ్యాయి.

అక్రమ సెటిల్మెంట్లను ఇజ్రాయిల్ ప్రభుత్వం బాహాటంగా సమర్థించడమంటే ఐక్యరాజ్య సమితి తీర్మానాలను తుంగలో తొక్కడమే. ఇజ్రాయిల్ నిర్మాణాలను, సెటిల్‌మెంట్ల విస్తరణను వ్యతిరేకిస్తూ ఫిబ్రవరి 14న భద్రతా మండలి ఏకగ్రీవంగా ఒక తీర్మానాన్ని ఆమోదించింది. అయితే, ఇజ్రాయిల్ సెటిల్‌మెంట్ల కార్యకలాపాలను తక్షణమే ఆపేయాలని కోరుతూ పాలస్తీనా ప్రతినిధి ప్రతిపాదించిన ముసాయిదా తీర్మానానికి, భద్రతా మండలి ఆమోదించిన తీర్మానానికి అసలు పొంతనే లేదు. అమెరికా జోక్యం చేసుకుని భద్రతా మండలి తీర్మానాన్ని ఎంతగా నీరుగార్చాలో అంతగా నీరుగార్చేసింది.

ఇంతకు ముందు సంపాదకీయంలో పేర్కొన్నట్లుగా, పాలస్తీనా ప్రయోజనాలకు మద్దతిచ్చే చిర కాల మిత్రత్వ వైఖరి నుండి భారత్ పక్కకు తప్పుకుంది. జెనిన్, నబ్లస్‌ల్లో ఇజ్రాయిల్ భద్రతా బలగాలు యథేచ్ఛగా సాగించిన హత్యాకాండ, హింసాకాండ గురించి మాట మాత్రంగా కూడా ప్రస్తావించకుండా, జెరూసలేంలోని యూదు ప్రార్థనా మందిరంపై దాడిని ఖండించడానికి మన విదేశాంగ మంత్రిత్వ శాఖ ఎక్కడ లేని ఆతృత కనబరచింది. పైగా అమెరికా, యుఎఇ, ఇజ్రాయిల్‌లతో కూడిన మధ్య ప్రాచ్య క్వాడ్‌లో భారత్ ఈ మధ్య చేరింది. నెతన్యాహు ప్రభుత్వ పచ్చి మితవాద, యూదు దురహంకార వైఖరికి హిందూత్వ శక్తులు పూర్తి స్థాయి మద్దతునిస్తున్నాయి.

ఇజ్రాయిల్ దౌర్జన్యాలు, దాష్టీకాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న పాలస్తీనియన్లకు భారత్‌లోని లౌకిక, ప్రజాతంత్ర శక్తులు సంఘీభావం తెలపడం అత్యంతావశ్యకం. మార్చి 7 నుండి 11 వరకు పాలస్తీనా సంఘీభావ ప్రచారాన్ని నిర్వహించాలంటూ అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం (అయిప్సో) పిలుపునిచ్చింది. ఈ ప్రచారాన్ని జయప్రదం చేసేందుకు అన్ని సామ్రాజ్యవాద వ్యతిరేక, వామపక్ష, ప్రజాతంత్ర శక్తులూ కృషి చేయాలి.

(పీపుల్స్ డెమోక్రసీ సంపాదకీయం)

జనవాక్యం

భద్రతా పర్యవేక్షణ ఏది?

రాష్ట్రంలో పలు కర్మాగారాల్లో ప్రమాదాలు చోటుచేసుకుంటున్న వార్తలు నిత్యం పత్రికల్లో వస్తున్నాయి.ఈ ప్రమాదాల్లో ఎంతోమంది కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారు.వారి మీద ఆధారపడిన కుటుంబాల పరిస్థితి దయనీయం.మరోవైపు ఇలా ప్రమాదాలు జరిగిన కర్మాగారాలు మూతపడటం, ఉత్పత్తి నిలిచిపోవడంతో ప్రభుత్వానికి పన్నుల రూపంలో రావాల్సిన ఆదాయం లేకుండా పోతుంది.సమస్యకు మూల కారణం ప్రభుత్వం ఆయా కర్మాగారాల్లో భద్రతా చర్యల పర్యవేక్షణకు తగినంత మంది సిబ్బందిని నియమించక పోవడం. ప్రమాదాలు జరిగిన తర్వాత కూడా నామ మాత్రపు కంటితుడుపు చర్యలతో సరిపెడుతున్నారు.ఇలాంటి మౌలిక సమస్యలపై దష్టి పెట్టకుండా పెట్టుబడులను ఆహ్వానించడం వల్ల పెద్దగా ప్రయోజనం ఉండదని పాలకులు తెలుసుకోవాలి.

కంభంపాటి కోటేశ్వర రావు,
మురళినగర్, విశాఖపట్నం.

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps@ gmail.com

ఎంపిక చేసిన కొంతమంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకే ఓపిఎస్

న్యూఢిల్లీ : ఎంపిక చేసిన కొంత మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకే పాత పెన్షన్ పథకం (ఒపిఎస్) ఎంచుకునే అవకాశం కలగనుంది. జాతీయ పెన్షన్ పథకం (ఎన్‌పిఎస్) నోటిఫైడ్ తేదీ అయిన డిసెంబరు 22, 2033కు ముందు జారీ అయిన ఉద్యోగ ప్రకటనలకు దరఖాస్తు చేసుకుని, ఈ పథకం అమల్లోకి వచ్చిన 2004లో సర్వీస్‌లో చేరిన ఉద్యోగులకు అవకాశం ఇవ్వాలని కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఆగస్టు 31 వరకూ ఈ అవకాశం కల్పించింది. పరిపాలన కారణాలతో 2004లో సర్వీస్‌లో చేరిన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, సెంట్రల్ ఆర్మడ్ పోలీస్ ఫోర్స్ (సిఎపిఎఫ్) సిబ్బందికి ఒపిఎస్ ఎంచుకునే అవకాశం ఇచ్చారు. ప్రస్తుతం ఎన్‌పిఎస్‌కు జమ అవుతున్న ఈ ఉద్యోగుల వ్యక్తిగత చెల్లింపులు తరువాత నుంచి జనరల్ ప్రాఫిడెంట్ ఫండ్‌కు జమ అవుతాయి.

ఉక్రెయిన్‌పై క్వాడ్‌లో కుదరని ఏకాభిప్రాయం

న్యూఢిల్లీ : ఉక్రెయిన్ యుద్ధంపై క్వాడ్ విదేశాంగ మంత్రుల సమావేశం ఎలాంటి ఉమ్మడి ప్రకటన చేయకుండానే ముగిసింది. గత వారం జి-20 ఆర్థిక మంత్రుల సమావేశం, రెండ్రోజుల క్రితం జి-20 విదేశాంగ మంత్రుల సమావేశం విఫలమైనట్లుగానే ఈ క్వాడ్ విదేశాంగ మంత్రుల సమావేశం కూడా విఫలమైంది. అణ్వాయుధాల వినియోగం లేదా వినియోగిస్తామన్న బెదిరింపులు తమకు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని అది పేర్కొంది.

తొలుత పార్లమెంట్ సమావేశాల పేరుతో జపాన్ విదేశాంగ మంత్రి యోషిమష హయషి వేరే ముఖ్యమైన కార్యక్రమం ఉందన్న పేరుతో దక్షిణ కొరియా విదేశాంగ మంత్రి జి 20 సమావేశాలకు డుమ్మా చెప్పిన నేపథ్యంలో క్వాడ్ విదేశాంగమంత్రుల సమావేశం మరో ప్రహసనంగా మిగిలిపోనుందా అన్న అనుమానాలు తలెత్తాయి. అయితే, క్వాడ్ సమావేశంలో పాల్గొనేందుకు హయషి శుక్రవారం ఉదయమే ఢిల్లీ చేరుకోవడంతో అనుకున్నదానికన్నా 20 నిమిషాల ఆలస్యంగా సమావేశం ప్రారంభమైంది. ఉక్రెయిన్ యుద్ధాన్ని ఖండిస్తూ ఓ సంయుక్త ప్రకటన చేయాలని అనుకున్నా, దీనిపై ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ఎలాంటి సంయుక్త ప్రకటన లేకుండానే ముగిసింది. రష్యాకు వ్యతిరేకంగా అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా దౌత్య, ఆర్థిక ప్రచారాన్ని సాగిస్తున్నాయి, అయితే, రష్యాను బహిరంగంగా విమర్శించడానికి భారత్ తిరస్కరించింది.

ఉక్రెయిన్‌లో అణ్వాయుధాల వినియోగ అవకాశాలను క్వాడ్ విదేశాంగ మంత్రులు ఖండించడమొక్కటే ఈసారి కనిపించిన మార్పుగా వుంది.

తీవ్రవాదంపై వర్కింగ్ గ్రూప్

చట్టబద్ధ పాలనను, సార్వభౌమాధికారాన్ని, ప్రాదేశిక సమగ్రతను, వివాదాలను శాంతియుతంగా పరిష్కరించుకోవడాన్ని క్వాడ్ గ్రూపు సమర్ధిస్తుందని విదేశాంగ మంత్రుల సమావేశం పేర్కొంది. కొత్తగా తలెత్తుతున్న తీవ్రవాద రూపాలను, రాడికల్‌వాదాన్ని, హింసాత్మక తీవ్రవాదాన్ని ఎదుర్కొనేందుకు క్వాడ్ వర్కింగ్ గ్రూప్‌ను ఏర్పాటు చేసినట్లు ప్రకటించారు. పరస్పరం సహకరించుకుంటూ క్వాడ్ ఎజెండాను ముందుకు తీసుకెళ్ళడానికి మంత్రులు ప్రతిన చేశారు.

సోనియాకు తీవ్ర అస్వస్థత

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఆమెను ఢిల్లీలోని గంగారామ్ ఆసుపత్రిలో చేర్పించారు. ఆమె జ్వరం, ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్నట్లు ఆసుపత్రి శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. ఆమెను పరిశీలిస్తున్నామని, పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపింది. ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని పేర్కొంది. సోనియా గాంధీని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఛెస్ట్ మెడిసిన్ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ అరూప్ బసు నేతృత్వంలోని వైద్యుల బృందం పర్యవేక్షిస్తోంది. గురువారమే ఆమెను ఆసుపత్రిలో చేర్చినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. 76 ఏళ్ల సోనియా గాంధీ ఆసుపత్రిలో చేరడం ఈ ఏడాదిలో ఇది రెండోసారి. శ్వాసకోశ ఇన్ఫెక్షన్ కారణంగా జనవరిలో ఆమె ఆసుపత్రిలో చేరి కొన్ని రోజుల పాటు చికిత్స తీసుకున్నారు.

అదానీతో ఒప్పందాలు రద్దు

(మొదటిపేజీ తరువాయి)

రైతుల ప్రయోజనాలను పణంగా పెట్టి వేల ఎకరాలు అదానికి అప్పచెప్పడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధపడిందన్నారు. ఇటువంటి అంతర్జాతీయ మోసగాడికి రాష్ట్ర సంపదను కట్టబెట్టడానికి తెలుగు ప్రజలు అంగీకరించరని చెప్పారు. కృష్ణపట్నం పోర్టు, జివికె, బొంబాయి ఎయిర్‌పోర్టు వంటి వాటిపై సిబిఐ, ఐటి దాడులు చేయించి, వాటి యజమానులను బెదిరించి బలవంతంగా అదానికి రాయించారని, దీనికి ప్రభుత్వ శాఖలను వినియోగించడం ద్వారా మోడీ ఆయనకు సహకరించారని చెప్పారు. మన రాష్ట్రంలో గంగవరం పోర్టులో ప్రభుత్వ వాటాలను కూడా కారుచౌకగా కట్టబెట్టారని విమర్శించారు. 16 శాతం వాటాను ఒక్కోషేరు రూ.120కి కట్టబెట్టారని పేర్కొన్నారు. అదీ చాలదన్నట్లు విశాఖ పోర్టు నుండి ఎగుమతి దిగుమతులయ్యే ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ కార్యకలాపాలను బలవంతంగా గంగవరం పోర్టు నుండి చేయిస్తున్నారని తెలిపారు. ఈ మేరకు బలవంతంగా ఎంఒయు కుదుర్చుకునాన్నరని చెప్పారు. అంతేకాకుండా పే అండ్ చెక్ పేరుతో దిగుమతులు చేసుకోకపోయినా డబ్బులు చెల్లించేలా ఒప్పందం రాసుకున్నారని అన్నారు. గ్యాస్ ధర ఇప్పటికే 50 రూపాయలు పెరిగిందని, ఈ ఒప్పందం కారణంగా భవిష్యత్‌లో మరింత పెరుగుతుందన్నారు. అదాని ప్రయోజనాల కోసం ప్రజలపై భారాలు మోపుతున్నారని అన్నారు. అదానీ అధ్వర్యంలోని ముంద్రా పోర్టు మాదకద్రవ్యాల రవాణాకు కేంద్రంగా మారిందని, గంగవరం పోర్టు భద్రతాపరంగానూ కీలకమైందని ఇక్కడ అటువంటి కార్యక్రమాలు జరిగితే దేశానికే ప్రమాదకరమన్నారు. అందువల్ల గంగవరం పోర్టును ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. 2019 నుండి అదానీ పన్నులూ కట్టడంలేదని , హిండెన్‌బర్గ్ నివేదికతో దిమ్మతిరిగి ఇప్పుడు కడుతున్నారని తెలిపారు. సుప్రీం కోర్టు కూడా విచారణకు కమిటీ వేసిందని వివరించారు. అదానీ ప్రాజెక్టుల నుండి యూనిట్ విద్యుత్‌ను రూ. 2.49కు కొనుగోలు చేస్తున్నారని, ఇప్పుడు మరో రూ.0.17 పైసలు పెంచాలని డిమాండు చేస్తున్నారని తెలిపారు. దీనివల్ల వినియోగదారులపై అదనపు భారం పడుతుందని హెచ్చరించారు. అవినీతిపరుడికి రాష్ట్రంలో పెద్దఎత్తున ఎందుకు ప్రాజెక్టులు కట్టబెడుతున్నారో ముఖ్యమంత్రి జగన్ కూడా వివరణ ఇవ్వాలని శ్రీనివాసరావు డిమాండు చేశారు.

గ్లోబల్ సమ్మిట్ ఓ బోగస్

విశాఖలో జరుగుతున్న పెట్టుబడుల సదస్సు బోగస్ అని వ్యాఖ్యానించారు. ఈ నాలుగేళ్లలో పరిశ్రమలు ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. ఈ సదస్సు కోసం 250 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారని అన్నారు. ఇప్పుడు ఎంఒయులు కుదుర్చుకుంటారని, వాటి ఆధారంగా భూములు కేటాయిస్తారని, ఆ భూములను చూపి కార్పొరేట్లు బ్యాంకుల నుండి రుణాలు తీసుకోవడం తప్ప, పరిశ్రమలు పెట్టడం, ఉద్యోగాలు ఇవ్వడం వంటివి జరగవని అన్నారు. చివరకు టూరిజం ప్రాజెక్టులు వస్తాయని, ఆ పేరుతో ఇప్పటికే మిగిలిపోయిన చెరువులు, పార్కులను కార్పొరేట్లకు కట్టబెడతారని అన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే రాష్ట్ర విభజన జరిగినప్పటినుండి ఎన్ని పరిశ్రమలు వచ్చాయి? ఎన్ని ఉద్యోగాలిచ్చారన్న అంశంపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగుల ఆందోళనలకు మద్దతు

సిపిఎస్‌కు వ్యతిరేకంగా ఒపిఎస్ సాధన కోసం ఉద్యోగులు, ఉపాధ్యాయులు చేస్తున్న ఆందోళనలకు వి. శ్రీనివాసరావు మద్దతు ప్రకటించారు. ఉద్యోగుల ఆందోళనలకు మద్దతుగా 9, 10 తేదీల్లో రాష్ట్ర వ్యాప్త కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. సిపిఐతో కూడా చర్చించి కార్యాచరణను ఖరారు చేస్తామని చెప్పారు. అనేక రాష్ట్రాలు సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్ అమలును ప్రారంభిస్తున్నాయని, మన రాష్ట్ర ప్రభుత్వం మాత్రం జిపిఎస్ అంటూ మరో కొత్త అంశాన్ని తీసుకువచ్చిందన్నారు. ఫించను సమస్యకు ఒపిఎస్ ఒక్కటే పరిష్కారమన్నారు. ప్రజలు కూడా ఈ సమస్య తీవ్రతను అర్థం చేసుకుని ఉద్యోగులకు సహకరించాలని కోరారు.

ధర్మానపై చర్యలు తీసుకోవాలి

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రభుత్వ ఉద్యోగులందరూ వైసిపికి ఓట్లు వేయకపోతే తమకు తెలుస్తుందని, వారిపై చర్యలు తీసుకుంటామని మంత్రి ధర్మాన ఉద్యోగులు, స్థానిక ప్రజాప్రతినిధులను బెదిరించడంపై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని శ్రీనివాసరావు కోరారు. సొంతపార్టీ వారిని బెదిరించడం సిగ్గుచేటన్నారు. గుంటూరు ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి కూడా రాయలసీమ పరిధిలోని కెజిబివి పాఠశాలలకు వెళ్లి అక్కడ ఉపాధ్యాయులపై బెదిరింపులకు దిగుతున్నారని ఆమెపైనా చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో తాను ఎన్నికైన ఆరు నెలల కాలంలో సర్వీసు కండీషన్లు మారుస్తానని లేకపోతే రాజీనామా చేస్తానని ఆమె చెప్పారని, హామీ ఇచ్చి రెండు సంవత్సరాలు గడిచినా ఇప్పటికీ పట్టించుకోలేదన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో భూములను అక్కడ గ్రామసభలు ఏర్పాటు చేయకుండా, గిరిజనుల అభిప్రాయాలు తీసుకోకుండా కంపెనీలకు కట్టబెట్టేస్తున్నారని అన్నారు. విశాఖలో అదానీ డేటా సెంటర్‌కు వేలకోట్ల విలువైన 400 ఎకరాలు కట్టబెట్టారని, ఇంతవరకు అతీగతి లేదని పేర్కొన్నారు. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు మాట్లాడుతూ మోడీ, జగన్ కలిసి అదానీకి ఆస్తులు కట్టబెడుతున్నారని తెలిపారు. గ్యాస్ ధరలు పెంచారని, విద్యుత్ సర్దుబాటు ఛార్జీల భారాన్ని మోపుతున్నారని వివరించారు. ఏప్రిల్‌లో యూనిట్‌కు రూ.0.19 పైసల నుండి రూ.0.66 పైసలు పెంచేందుకు సిద్ధపడుతున్నారని అన్నారు.



మీకోసం
గారెలు వండేటప్పుడు నూనె పేలకుండా ఉండాలంటే కాగిన నూనెలో ఒక చెంచా నెయ్యి వేయాలి.

జీవన సౌరభం
ఓటమి నేర్పిన పాఠాలు గుర్తుపెట్టుకుని గెలవడం నేర్చుకోవాలి

ఉన్నచోటనే ఊయలూగవే

గాలిపటమా! ఎగురవే
నీలినింగిని తాకవే
గద్దలే నిను తాకబోగా
ముద్దులాడుచు ఎగురవే!


మబ్బులతో దోబూచులాడవే
మనసులను మురిపించవే
మనుషులే అడ్డగించినా
మునుముందుకే తరలవే!

విహంగంలా ఎగురవే
వినువీధిన విహరించవే
వన్నెచిన్నెలు చూపుచూ
చిన్నారులను అలరించవే!

చెట్టుకొమ్మల చిక్కకే
చిక్కులు తెచ్చిపెట్టకే
చిన్నిబాలలు చిందులేసేలా
ఉన్నచోటనే ఊయలూగవే!



– చంద్రకళ. దీకొండ
మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా



దారి చూపండి

చిన్నారులూ, బయట ఉన్న క్యూటీ, లోపల ఉన్న పప్పీని కలుసుకోవాలి. మరి దారి చూపి సాయం చేయరూ!

నేను గీసిన బొమ్మ




– బి. శివాణి, 7వ తరగతి, నర్సింహులపల్లి, పెద్దపల్లి జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

కార్బన్ నెగిటివ్ టాయిలెట్లు

ఈ టాయిలెట్లను చూస్తే ఇగ్లూ ఇళ్ల మాదిరిగా ఉన్నాయి. కాని ఇది పబ్లిక్ టాయిలెట్లు. దీని నిర్మాణానికి ఉపయోగించిన మెటీరియల్ దేశంలో ఎక్కడా ఉపయోగించలేదు. పర్యావరణానికి చెడు చేసే ప్లాస్టిక్ వ్యర్థాలను ఇటుకులుగా రూపానీ వర్మ మార్చిన తీరు అంతర్జాతీయ పరిశీలకులను ఆకట్టుకుంది. దాంతో ఈ టాయిలెట్లను విమానాశ్రయాల్లో నిర్మించేందుకు అనుమతి ఇచ్చారు. తాను సాధించిన ఈ విజయం వెనక దాగి ఉన్న కష్టాన్ని తన మాటల్లో విందాం.





'చిన్నప్పటి నుంచీ అమృతసర్‌లో ప్రకృతి అందాలు చూస్తూ పెరిగాను. అందుకే పర్యావరణం నాశనం చేసే ప్లాస్టిక్ పట్ల వ్యతిరేకత పెరిగింది. దాంతో ప్రకృతికి అనుకూలమైన పదార్థాలను చేయడంలో నా వంతు బాధ్యతగా వ్యవహరించాలనుకున్నా. ఆ విధమైన ప్రయోగాలు పాఠశాల స్థాయి నుంచి ప్రారంభించా. అందుకు నా తల్లిదండ్రులు ఎప్పుడూ ప్రోత్సహించేవారు. వాడి పడేసిన బాటిళ్లు సేకరించి పొడిగా చేసి ఆ పదార్థంతో చిన్న చిన్న వస్తువులు చేసి ఆనందపడేదాన్ని. ఈ ఆసక్తి ఆర్కిటెక్చర్ వైపు అడుగులు వేసేలా చేసింది. జైపూర్‌లోని జయశ్రీ పెరివాల్ ఇంటర్నేషనల్ కాలేజీలో చదువుకుంటున్నా. వేసవి సెలవుల్లో కొత్త విషయాలు తెలుసుకునేందుకు ఆసక్తి కనబరిచేదాన్ని. నీటి వృధా కాకుండా, వాయు కాలుష్యం పెంచే నిర్మాణ రంగ పదార్థాలు.. ఇవన్నీ పర్యావరణంపై ఏ విధంగా ప్రభావితం చేస్తాయో ప్రయోగాత్మకంగా తెలుసుకున్నా. అప్పుడే పెద్ద ఎత్తున పోగుబడుతున్న సిలికా ప్లాస్టిక్‌తో ఇటుకలను తయారుచేస్తున్న వీడియోలు చూశా. ఇంటర్నెట్‌లో కథనాలూ చదివా. అప్పటి నుంచీ




పర్యావరణ అనుకూల ఇటుకలను పరిశోధించడం ప్రారంభించా. ఆ రకం ఇటుకలు తయారీ చేయాలని నిర్ణయించుకున్నా. ఇవి టాయిలెట్ల నిర్మాణంలో సమాజానికి ఉపయోగపడితే బాగుండు అనిపించింది. ఆ దిశగా నా ప్రయత్నం సాగింది.


అప్పుడే ఆర్‌ప్లస్‌డి స్టూడియో నిర్వాహకులు ఆర్కిటెక్ట్ శ్రీధర్‌రావు సహాయం కోరా. నా ఆలోచన నచ్చి ఆయన బృందంలోని మరి కొంతమంది సభ్యుల సహకారంతో నా ప్రాజెక్టుకు ఒకే చెప్పారు. దాంతో ఇటుకలు తయారీ పరిశోధనకు పునాది పడింది. స్కూళ్లు, ఆఫీసులు తిరిగి ప్లాస్టిక్ సేకరించా. వాటిని రీసైక్లిలింగ్ చేసి ఇటుకల మార్చేందుకు చాలా కష్టపడ్డా. టాయిలెట్ నిర్మాణానికి తగిన విధంగా ఫౌండరీ డస్ట్, ప్లాస్టిక్ వ్యర్థాలు, సిలికా ప్లాస్టిక్ కలిపి ఇటుకలను తయారుచేశా. అందుకు మూడు నెలలు పట్టింది. నా పట్టుదల చూసి టీం సభ్యులు ఆశ్చర్యపోయారు.' చిన్నపిల్లవి అయినా చాలా కష్టపడుతున్నావు... నీ ప్రయోగం సక్సెస్ అవుతుంది' అని ధైర్యం చెప్పారు. టీమ్‌లో లీడ్ ఆర్కిటెక్ట్‌గా శ్రీధర్, పార్ట్‌నర్ ఆర్కిటెక్ట్‌గా శిఖా దూగర్ (47), ప్రాజెక్ట్ ఆర్కిటెక్ట్‌గా రాణా సర్కార్ (27), జూనియర్ ఆర్కిటెక్ట్‌గా మానవి దీక్షిత్ (25), అభిషేక్ సింగ్ (27) గ్రాఫిక్స్ అందించారు. ప్రాజెక్టుకు అవసరమైన సాంకేతిక లభించింది. దాంతో టాయిలెట్ నిర్మాణం చేపట్టాం.

సౌకర్యవంతంగా

4 లక్షల సింగిల్ యూజ్ ప్లాస్టిక్ బ్యాగ్‌లతో తయారు చేసిన 1,000 ఫ్లాట్ ప్లాంక్‌లు,150 లెగో తరహా ఇటుకలను నిర్మాణంలో ఉపయోగించాం. ఎంఎస్ యాంగిల్స్, పివిసి పైపులు, హెచ్‌డిహెచ్ఎంఆర్ బోర్డులు, మెటల్, ముడతలు ఉన్న షీట్లుతో టాయిలెట్లు నిర్మించాం. ఇవి త్వరగా చెడిపోవు. మురికి పట్టవు. చెడు వాసన వెదజల్లదు. ఎక్కువ మంది ఒకేసారి టాయిలెట్లకు వెళ్లే విధంగా లోపల గదులను అనువుగా మార్చాం. ఈ టాయిలెట్ల సామగ్రిని ఉన్న చోట ఊడదీసి మరొక ప్రదేశంలో నిర్మించవొచ్చు. దీన్ని ఏర్పాటు చేయడానికి రెండు నెలలు పట్టింది. కాని భవిష్యత్తులో రెండు వారాల్లో తయారీ అయ్యేలా సిద్ధం చేస్తున్నాం. రెండు సంవత్సరాలకోసారి పెయింట్ వేసుకోవాలి. అనుకున్న విధంగానే ప్రాజెక్టు అయ్యింది. కుటుంబసభ్యులు చాలా సంతోషించారు. దాంతో ప్రభుత్వ అధికారులకు వివరించాం. వారికి నచ్చింది. అమృత్‌సర్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయం పార్కింగ్ స్థలంలో 'స్వచ్ఛ్ అలయ్' పేరుతో టాయిలెట్ రూం ఏర్పాటు చేశాం. మెటీరియల్ ఖర్చు తగ్గ రేటు మాత్రమే తీసుకున్నాం. భవిష్యత్తులో మరొక పెద్ద కాంట్రాక్టు వచ్చే అవకాశమూ ఉంది. ఇంకా దీనిపై స్టడీ చేయాల్సి ఉంది. అందుకే అమెరికా వెళ్లి పైచదువు చదవాలనుకుంటున్నా. పర్యావరణానికి మేలు చేసే ఇలాంటి మంచి ఆవిష్కరణలు మరిన్ని చేయాలి కదా!'



చల్లనీళ్లతో స్నానం



బయట ఎండతో శరీరం కమిలి పోతుంది. ఒక్కోసారి ఎర్రగా బొబ్బలు కూడా వస్తాయి. ఈ క్రమంలో చెమట బాగా పడుతుంది. ఈ సమయంలో వేడినీళ్ల స్నానం కన్నా చల్లనీళ్లతో స్నానం మంచిదంటున్నారు వైద్యులు. చల్లటి నీటితో స్నానం చేస్తే రోగనిరోధక శక్తి పెరుగుతుందని అధ్యయనాల్లో నిరూపించారు కూడా.

- ఎండలో పనిచేసి అలిసిపోయిన శరీరానికి చల్లటి నీళ్లతో స్నానం చేస్తే నాడీ వ్యవస్థ సక్రమంగా పనిచేస్తుంది. నోరాడ్రినలిన్ హార్మోన్ పెరుగుతుంది. ఈ హార్మోన్ గుండె రేటును రక్త వేగాన్ని పెంచుతుంది. ఇది ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.
- రక్త ప్రసరణలో మెరుగుదల కనిపిస్తుంది. ఎండలోకి వెళ్లినప్పుడు చర్మానికి రక్త ప్రసరణ తగ్గుతుంది. చల్లనీళ్లు తగిలినప్పుడు శరీరం వేడెక్కాల్సి ఉంటుంది. ఈ కారణంగా శరీరంలో రక్త ప్రవాహం పెరుగుతుంది. వ్యాయామం తర్వాత చల్లటి నీటితో స్నానం చేస్తే నాలుగు వారాల తర్వాత కండరాలకు రక్త ప్రసరణ మెరుగుపడిందని ఒక అధ్యయనంలో తేలింది.
- చల్లటి నీటితో స్నానం చేయడం వల్ల మానసిక ఆరోగ్యం కూడా కలుగుతుంది. ముఖం, మెడపై చల్లటి నీరు పడినప్పుడు మెదడు పనితీరు మెరుగుపడుతుంది.

సంపదపై దురాశ వల్లే అవినీతి కేన్సర్

- సామాజిక న్యాయం కల్పనలో తీవ్ర అవరోధం
- సుప్రీంకోర్టు ధర్మాసనం

ప్రజాశక్తి–న్యూఢిల్లీ బ్యూరో



సంపదపై దురాశే అవినీతిని ప్రోత్సహిస్తూ క్యాన్సర్‌గా వృద్ధి చెందడానికి దోహదపడిందని సర్వోన్నత న్యాయస్థానం ఆందోళన వ్యక్తం చేసింది. న్యాయస్థానాలు అవినీతిని ఏమాత్రం సహించకూడదని, దేశ ప్రజల తరపున బాధ్యతగా ఉంటూ ఇటువంటి నేరాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించాల్సి ఉందని స్పష్టం చేసింది. ఆదాయానికి మించిన ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలపై ఛత్తీస్‌గఢ్ మాజీ ప్రధాన కార్యదర్శి అమన్‌సింగ్, ఆయన భార్యపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను ఆ రాష్ట్ర హైకోర్టు కొట్టివేసింది. దీనిని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను శుక్రవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎస్ రవీంద్రభట్, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన సుప్రీం ధర్మాసనం విచారించింది. ఛత్తీస్‌గఢ్ హైకోర్టు తీర్పును పక్కనబెట్టింది. ఈ సందర్భంగా కొన్ని కుంభకోణాలను ప్రస్తావించిన సుప్రీంకోర్టు ధర్మాసనం వాటిపై దర్యాప్తు జరుగుతున్న తీరు బాధ కలిగిస్తోందని అభిప్రాయపడింది. రాజ్యాంగ పీఠిక హామీ ఇచ్చినట్లుగా ప్రజలకు సామాజిక న్యాయం కల్పించడంలో అవినీతి అనేది తీవ్ర అవరోధంగా మారుతోందని సుప్రీం కోర్టు అభిప్రాయపడింది. "సంపద అందరికీ సమానంగా అందాలనే రాజ్యాంగ పీఠిక సమన్యాయ హామీ ఇప్పటికీ అందని ద్రాక్షగానే మిగిలింది. అందుకు ఎన్నో కారణాలు ఉన్నప్పటికీ దాన్ని సాధించడానికి ప్రధాన అవరోధం మాత్రం అవినీతే. ఈ అవినీతి.. కేవలం పాలనా రంగానికే పరిమితం కాలేదు. దురదృష్టవశాత్తు ప్రతి ఒక్కరి జీవితంలోనూ ఏదో రూపంలో భాగమైందని పౌరులే చెప్పే స్థాయికి చేరింది. దీని మూలాలపై పెద్దగా చర్చ చేయడం అవసరం లేనప్పటికీ.. సంపదపై దురాశ అనేది అవినీతి క్యాన్సర్‌గా వృద్ధి చెందేందుకు దోహదం చేస్తోంది" అని పేర్కొంది. ప్రజాసేవలో ఉన్నవారిలో కొంతమంది వ్యక్తిగత ప్రయోజనాల కోసం వెంపర్లాడటంపై అత్యున్నత న్యాయస్థానం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది.



బుక్‌స్టాల్‌పై దాడి చేస్తున్న హిందూ మతతత్వ గ్రూప్

ఢిల్లీ బుక్ ఫెయిర్‌లో క్రిస్టియన్ ఆర్గనైజేషన్ బుక్‌స్టాల్‌పై దాడి

- 'జై శ్రీరాం..' అంటూ హిందూ మతతత్వ గ్రూప్ గలాటా

న్యూఢిల్లీ : ఢిల్లీలో జరుగుతున్న 'ప్రపంచ బుక్ ఫెయిర్'లో క్రిస్టియన్ ఆర్గనైజేషన్ బుక్ స్టాల్‌పై కొంతమంది దాడికి తెగబడ్డారు. 'జై శ్రీరాం..' అంటూ నినాదాలు చేస్తూ బుక్ స్టాల్‌ను ధ్వంసం చేశారు. బుధవారం చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. క్రిస్టియన్ అసోసియేషన్ 'గిడియోన్స్ ఇంటర్నేషనల్' ఆధ్వర్యంలో ఏర్పాటైన బుక్‌స్టాల్ బైబిల్ పుస్తకాల్ని ఉచితంగా పంపిణీ చేయటంపై హిందూత్వ గ్రూప్‌నకు చెందిన కొంతమంది అభ్యంతరం వ్యక్తం చేశారు. బుక్‌స్టాల్‌కు ఎదురుగా 'జై శ్రీరాం..' 'హర హర మహాదేవా' అంటూ నినాదాలు చేశారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్న కొంతమంది ఆ బుక్‌స్టాల్‌పై దాడికి దిగటమేగాక, బైబిల్ పుస్తకాల్ని ఇష్టమున్నట్టు విసిరేశారు. అక్కడ ఏర్పాటుచేసుకున్న పోస్టర్లను చించేశారు. ఈ ఘటనపై 'గిడియోన్స్ ఇంటర్నేషనల్' వాలంటీర్ మాట్లాడుతూ, "హిందూత్వ గ్రూప్‌నకు చెందిన కొంతమంది ఈ దాడికి తెగబడ్డారు. బైబిల్ పుస్తకాల్ని ఇష్టమొచ్చినట్టు పడేసి, చింపేశారు. వాలంటీర్లలో ఒకరైన డేవిడ్‌ను నెట్టేసి, కిందపడేశారు" అని చెప్పారు. యునైటెడ్ క్రిస్టియన్ ఫోరం అధ్యక్షుడు మైఖేల్ విలియం ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు.

హిజాబ్ కేసు విచారణకు బెంచ్ ఏర్పాటు : సిజెఐ

న్యూఢిల్లీ : కర్ణాటక నుంచి వచ్చిన హిజాబ్ బ్యాన్ కేసును విచారించడానికి నూతన ధర్మాసనం ఏర్పాటు చేస్తామని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ శుక్రవారం తెలిపారు. విచారణ తేదీని మాత్రం వెల్లడించలేదు. విద్యాసంస్థల్లో హిజాబ్‌ను ధరించడాన్ని నిషేధిస్తూ కర్ణాటక ప్రభుత్వ ఆదేశాలకు వ్యతిరేకంగా కొందరు విద్యార్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే.

అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించే దమ్ము బిజెపికి లేదు

- సిపిఎం జమ్ముకాశ్మీర్ నేత తరిగామి



శ్రీనగర్ : కాశ్మీర్ మహోత్సవ్‌ను ఉద్దేశిస్తూ కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను సిపిఎం నేత మహ్మద్ యూసుఫ్ తరిగామి తీవ్రంగా విమర్శించారు. 'జమ్ము కాశ్మీర్ గురించి గొప్పగా చెప్పుకోవడానికి ఇక్కడ ఏమీ లేదు. పంచాయతీ ఎన్నికలు నిర్వహించామని హోం మంత్రి చెప్పుకుంటున్న ప్రకటనలు వాస్తవాలకు పూర్తి విరుద్ధంగా వున్నాయి, 2001, 2011, 2018ల్లో కూడా పంచాయతీ ఎన్నికలు నిర్వహించారు. పైగా, దేశంలోని ఇతర ప్రాంతాల్లో కూడా ఇలాగే ఎన్నికలు నిర్వహిస్తున్నారు. కానీ అక్కడి ప్రజలు తమ అసెంబ్లీలకు ప్రతినిధులను ఎన్నుకునే హక్కును కోల్పోరని అన్నారు. పంచాయతీరాజ్ సంస్థలు అసెంబ్లీలకు ప్రత్యామ్నాయం కాదు, ఫెడరల్ నిర్మాణంలో ప్రజాస్వామ్యానికి కీలకమైన మూలస్తంభం చట్టసభ. జమ్మూ కాశ్మీర్‌లో అటువంటి మూల స్తంభాన్ని భారత ప్రభుత్వం నాశనం చేసిందని' తరిగామి విమర్శించారు. నియోజకవర్గాల పునర్విభజనను పూర్తి చేసి, ఓటర్ల జాబితాను సవరించినా అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించే ధైర్యం ప్రభుత్వానికి లేదని అన్నారు. ప్రస్తుతం కాశ్మీర్‌లో పరిస్థితిని ప్రజాస్వామ్యానికి ఒక నమూనాగా ప్రభుత్వం చెబుతున్నట్టైతే గుజరాత్‌లో లేదా ఇతర బిజెపి పాలిత రాష్ట్రాల్లో దాన్ని అమలు చేయకుండా ఆపుతోంది ఎవరని తరిగామి ప్రశ్నించారు. పెరుగుతున్న నిరుద్యోగం గురించి హోం మంత్రి విస్మరించడం దురదృష్టకరమని అన్నారు. పెరుగుతున్న నిరుద్యోగంతో ఈ ప్రాంతంలో వేలాదిమంది యువత దిక్కుతోచని స్థితిలో పడ్డారన్నారు.

నేడు సిసోడియా బెయిల్ పిటిషన్ విచారణ

న్యూఢిల్లీ : ఢిల్లీ మద్యం కేసులో అరెస్టయిన ఆప్ నేత మనీష్ సిసోడియా దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను శనివారం ఢిల్లీ హైకోర్టు విచారించనుంది. సిబిఐ అరెస్ట్ నేపథ్యంలో తన అరెస్టును, సిబిఐ విచారణను సవాలు చేస్తూ సిసోడియా సుప్రీంకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. అయితే ముందుగా హైకోర్టుకు వెళ్లాలని చీఫ్ జస్టిస్ డి.వై. చంద్రచూడ్ సూచించారు. ఢిల్లీలో ఉన్నంత మాత్రాన సుప్రీంకోర్టుకు రావడం సరికాదని అన్నారు. దీంతో ఢిల్లీ హైకోర్టులో సిసోడియా పిటీషన్ వేశారు.

మూడో టెస్ట్‌లో ఓటమే

మూడో టెస్ట్‌లో తొమ్మిది వికెట్ల తేడాతో ఆస్ట్రేలియా గెలుపు

నాల్గో టెస్ట్‌లో గెలిస్తేనే డబ్ల్యుటిసి బెర్త్



ఇండోర్: మూడో టెస్ట్‌లో టీమిండియా పరాజయాన్ని చవిచూసింది. శుక్రవారం ఉదయం సెషన్ ప్రారంభం కాగానే అశ్విన్ రెండో బంతికి ఖవాజాను ఔట్ చేయడంతో అభిమానులు సంబరపడ్డారు. కానీ వారి ఆశలను నీరుకారుస్తూ ట్రావిస్ హెడ్(49), లబుషేన్(28) మరో వికెట్ పడకుండా మ్యాచ్‌ను ముగించారు. దీంతో ఆస్ట్రేలియా జట్టు మూడో టెస్ట్‌లో 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలి ఇన్నింగ్స్‌లో టీమిండియా 109పరుగులే కుప్పకూలడం ఓటమికి ప్రధాన కారణంగా చెప్పుకోవచ్చు. దీంతో నాలుగు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 2–1 ఆధిక్యంలో ఉండగా.. టీమిండియా డబ్ల్యుటిసి ఫైనల్ బెర్త్‌ను ఖాయం చేసుకోవాలంటే మాత్రం నాల్గో టెస్ట్‌లో గెలుపు తప్పనిసరి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ నాథన్ లియాన్‌కు లభించింది. ఈ మైదానంలో టీమిండియా దాదాపు పదేళ్ల తర్వాత పరాజయాన్ని చవిచూసింది. అహ్మదాబాద్ వేదికగా మార్చి 9నుంచి నాలుగో టెస్టు జరగనుంది.

నాణ్యతలేని పిచ్ ఇది: ఐసిసి

మూడో టెస్ట్ జరిగిన ఇండోర్ పిచ్‌కు ఐసిసి రేటింగ్ ప్రకటించింది. ఈ పిచ్ నాణ్యతలేని(పూర్) పిచ్‌గా రేటింగ్ ఇచ్చింది. ఈ మైదానంలో జరిగిన మూడో టెస్ట్‌లో ఏ జట్టూ 200కు పైగా స్కోర్ చేయలేకపోయిందని, ఆతిథ్య జట్టే తొలి ఇన్నింగ్స్‌లో 109 పరుగులకు ఆలౌట్ కావడమే ఇందుకు నిదర్శనమని ఐసిసి ఆ ప్రకటనలో పేర్కొంది.

డబ్ల్యుటిసి ఫైనల్‌కు ఆస్ట్రేలియా

మూడో టెస్ట్‌లో ఆస్ట్రేలియా జట్టు ఘన విజయం సాధించడంతో ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్(డబ్ల్యుటిసి) ఫైనల్లోకి అడుగుపెట్టింది. ప్రస్తుతం ఆస్ట్రేలియా జట్టు 68.52 విజయాలు, 148 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి ఫైనల్‌కు చేరింది. భారత్ నాలుగో టెస్టులో గెలిస్తే నేరుగా డబ్ల్యుటిసి ఫైనల్‌కు చేరనుంది. టీమిండియా (60.29 విజయాలు, 123 పాయింట్లు) రెండో స్థానంలో కొనసాగుతోంది. మరోవైపు శ్రీలంకజట్టు ఫైనల్ చేరే అవకాశమూ లేకపోలేదు. శ్రీలంక 2–0తో న్యూజిలాండ్‌పై టెస్ట్ సిరీస్ గెలిచి, భారత్ నాల్గో టెస్ట్‌లో ఓడితేనే శ్రీలంకకు అవకాశం దక్కనుంది. ప్రస్తుతం శ్రీలంక 53.33 శాతం విజయాలు, 64 పాయింట్లతో మూడో స్థానంలో ఉంది.

రెస్టాఫ్ ఇండియాకు భారీ ఆధిక్యత

గ్వాలియర్: ఇరానీ కప్‌లో రెస్టాఫ్ ఇండియాకు 190పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. ఓవర్ నైట్ స్కోర్ మూడు వికెట్ల నష్టానికి 112 పరుగులతో శుక్రవారం తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన మధ్యప్రదేశ్ జట్టు 112.4 ఓవర్లలో 294పరుగులకు ఆలౌటైంది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన రెస్టాఫ్ ఇండియా జట్టు మూడోరోజు ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టపోయి 85పరుగులు చేసింది. యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్(58నాటౌట్) అర్ధసెంచరీతో మెరిసాడు. దీంతో రెస్టాఫ్ ఇండియా జట్టు ఇప్పటికే 275పరుగుల ఆధిక్యతను సంపాదించింది. అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లో రెస్టాఫ్ ఇండియా 484పరుగుల భారీ స్కోర్‌ను చేసిన సంగతి తెలిసిందే.



కీటకాల దాడితో మైదానంపై బోర్లా పడుకున్న ఆటగాళ్లు

మనోజ్ వెడ్స్ మౌనిక



మంచు మనోజ్ వివాహ బంధంలోకి అడుగు పెడుతున్నట్లు సోషల్ మీడియా ద్వారా ప్రకటించారు. కొంతకాలంగా మనోజ్ వివాహం విషయంలో సోషల్ మీడియాలో వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. వీటన్నింటికీ చెక్ పెడుతూ తనకు కాబోయే సతీమణి ఈమేనంటూ భూమా మౌనికా రెడ్డి ఫొటోను శుక్రవారం ఉదయం ట్విటర్ వేదికగా మనోజ్ షేర్ చేశారు. 'పెళ్లికూతురు భూమా మౌనికా రెడ్డి' అని హ్యాష్‌ట్యాగ్‌ను కూడా జత చేశారు. దీనిని చూసిన సినీ ప్రియులు ఆ జంటకు శుభాకాంక్షలు చెబుతున్నారు. మనోజ్‌కు 2015లోనే ప్రణతీరెడ్డితో వివాహమైంది. అయితే పరస్పర అంగీకారంతో 2019లో వీరిద్దరూ విడాకులు తీసుకున్నారు.


అర్జున్‌రెడ్డి దర్శకుడితో అల్లు అర్జున్ సినిమా

ఐకాన్‌స్టార్ అల్లు అర్జున్ హీరోగా, 'అర్జున్ రెడ్డి' దర్శకుడు సందీప్ రెడ్డి వంగాతో ఓ సినిమా ఖరారైంది. ప్రముఖ నిర్మాణ సంస్థ టీ సిరీస్ బ్యానర్‌పై ఇది రూపుదిద్దుకోనుంది. భూషణ్ కుమార్ నిర్మాత. ఈ విషయాన్ని శుక్రవారం టీ సిరీస్ వెల్లడించింది. దీనిపై సినీ ప్రియులు, అభిమానులు ఫుల్ ఖుష్‌లో ఉన్నారు.

ఇక మహిళల సంగ్రామం

డబ్ల్యుపిఎల్ నేటినుంచే..

గుజరాత్ × ముంబయి మ్యాచ్‌తో ప్రారంభం



ముంబయి: భారత క్రికెట్ కంట్రోల్‌బోర్డు(బిసిసిఐ) ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోన్న మహిళల ప్రిమియర్ లీగ్ (డబ్ల్యుపిఎల్) శనివారం నుంచి ప్రారంభం కానుంది. ముంబయిలోని డివైపాటిల్, బ్రాబౌర్న్ వేదికల్లో ఈ టోర్నీ జరగనుంది. అగ్రశ్రేణి మహిళా క్రికెటర్లందరూ ఈ టోర్నీ బరిలోకి దిగడం.. ఫ్రాంచైజీలు వారిని కోట్లాది రూపాయలకు కొనుగోలు చేయడంతో ఆరంభ డబ్ల్యుపిఎల్‌కు క్రేజ్ అమాంతం పెరిగిపోయింది. మొత్తం ఐదుజట్ల మధ్య జరిగే ఈ డబ్ల్యుపిఎల్ టోర్నీ పోటా పోటీగా సాగడం ఖాయం. లీగ్ దశ ముగిసిన అనంతరం పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉన్న జట్టు నేరుగా ఫైనల్లోకి ప్రవేశించనుంది. ఇక 2, 3 స్థానాల్లో నిలిచిన జట్ల మధ్య ఎలిమినేటర్ మ్యాచ్ జరగనుంది. 26న ముంబయిలోని బ్రాబౌర్న్ వేదికగా డబ్ల్యుపిఎల్ ఫైనల్ మ్యాచ్ జరగనుంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68